ప్రజాశక్తి
గురువారం 12 జూన్ 2025 8 పేజీలు
గుంటూరు పల్నాడు

కూటమి పాలనపై పెదవి విరుపులు

- ఎమ్మెల్యేల కనుసన్నల్లో అక్రమాలు
- పెరగని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- కోలుకోలేని దెబ్బతిన్న రైతులు
- హామీల అమలుపై దృష్టి సారించని ప్రజా ప్రతినిధులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచింది. గురువారం జిల్లా వ్యాప్తంగా కూడా కూటమి ప్రభుత్వం తొలి వార్షికోత్సవ సంబరాలు జరగనున్నాయి. ఐదేళ్ల పాటు సంక్షేమ పథకాలను పక్కాగా అమలు చేసినా వైసిపి పాలన తీరు తెన్నులపై విసిగిపోయిన ప్రజలు ఎన్నో ఆశలతో టిడిపి కూటమికి మద్దతు పలికారు. మంచి పరిపాలన కావాలని, తమకు శాశ్వత ప్రాతిపదికన ఆదాయం రావాలన్న లక్ష్యంతో ప్రజలంతా తమ పిల్లలకు ఉపాధి అవకాశాలు పెరగాలని, చదువుకున్న పట్టభద్రులకు ఉద్యోగాలు రావాలన్న ఆకాంక్షతో కూటమి పార్టీలకు తిరుగులేని విజయాన్ని అందించారు. కానీ వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉండటంతో కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. సామాజిక పింఛన్ల సొమ్ము పెంచి ఇవ్వడం తప్ప ఇచ్చిన హామీల అమలుకు తొలి ఏడాది పూర్తి స్థాయిలో దృష్టి సారించలేదు.

గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలన్నీ ఈ ఏడాది కాలంగా కొనసాగాయి. పాలనలో ఆశించిన మార్పులు లేవు. ప్రజా ప్రతినిధులు, అధికారుల అవినీతి తగ్గడం లేదు. గతంలో జరిగిన పాలనా పరమైన లోపాలు ఇప్పటికీ కొనసాగుతుండటంతో పాటు ప్రజా సమస్యలను గాలికి వదిలివేయడంతో కూటమి ప్రభుత్వంపై ఏడాదిలోనే ప్రజల్లో అసంతృప్తికి దారితీసింది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు సంబంధించి జిల్లాలో చెప్పుకోదగ్గ ప్రాజెక్టులు రాలేదు. కొత్త ఫ్యాక్టరీలు, పెట్టుబడిదారులు రాలేదు. రాజధాని అమరావతి నిర్మాణ పనులు పున:ప్రారంభం అయినా మందగమనం కొనసాగుతోంది. రాజధాని రైతులకు అభివృద్ధి చేసిన ప్లాట్లు అప్పగింత పూర్తి కాలేదు.

ఈ ఏడాది వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో చిక్కుయిఖంది. ఏ పంట సాగు చేసినా ఉత్పత్తులకు ధరల్లేక రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సకాలంలో స్పందించలేదు. మిర్చి, పొగాకు విషయంలో ఆలస్యంగా స్పందించినట్లు ప్రకటనలు వచ్చినా ఆచరణలో మాత్రం రైతులకు జరిగిన మేలు శూన్యం. వరి, పత్తి, మిర్చి, పొగాకు, నల్లబర్లీ పొగాకు, అపరాలు సాగు చేసిన ప్రతి రైతు భారీగా నష్టాలను మూటగట్టుకున్నారే కానీ వ్యవసాయం వల్ల ఈఏడాది లాభం వచ్చిన వారి సంఖ్య చాలా అరుదుగా కన్పిస్తోంది. ఈ విషయంలో వ్యవసాయ, ఉద్యాన, అనుబంధ శాఖల పనితీరు చాలా అధ్వానంగా ఉంది. ఉమ్మడి జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా రైతుల సమస్యలపై ఉమ్మడి జిల్లా స్థాయిలో ఒక్క సమీక్ష చేయలేదు. జనసేన నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న నాదెండ్ల మనోహర్ తెనాలికి పరిమితం అవుతున్నారు. మంత్రి అనగాని సత్య ప్రసాద్ ఎక్కువగా బాపట్ల జిల్లాకు, కీలక మంత్రి నారా లోకేష్ పూర్తిగా మంగళగిరికి, ఇతర జిల్లాలకు పరిమితం అవుతున్నారు. రైతుల సమస్యలపై ఉమ్మడిగా ముగ్గురు మంత్రులు స్పందించిన పరిస్థితులు లేవు.

ఏడాదిగా ప్రభుత్వం అమలు చేస్తామన్న పథకాలు కూడా అమలుకు నోచుకోలేదు. మూడు గ్యాస్ సిలిండర్ల తొలి సారి 90 శాతం మందికి జమ అయింది. రెండో విడత చాలా మందికి రాలేదు. ఈ

▶ 2లో

నేటి నుంచి బడిగంట

- పాఠశాలల్లో సంస్కరణల కొనసాగింపు
- పంచాయతీకో మోడల్ పాఠశాల ఖరారు
- తల్లికి వందనం అమలుకు సన్నాహాలు
- సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం
- హెచ్‌ఎంలకు చేరిన విద్యార్థి మిత్ర కిట్లు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిది

వేసవి సెలవుల అనంతరం గుంటూరు, పల్నాడు జిల్లాల్లో పాఠశాలలు గురువారం నుంచి పున్నప్రారంభం కానున్నాయి. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలో చేరికలు పెరుగుతాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు. గత విద్యా సంవత్సరంలో మొత్తం 2,97,993 మంది విద్యార్థులు చదివారు. వీరిలో ప్రభుత్వ పాఠశాలల్లో 82,727, ఎయిడెడ్ పాఠశాలలు 10,200 మంది ఉన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో 1,97,488 మంది చదివారు. పల్నాడు జిల్లాలో మొత్తం 2036 పాఠశాలలు ఉండగా 3,00,961 మంది విద్యార్థులు ఒకటి నుంచి 10 వరకు చదివినట్లు అధికారులు తెలిపారు. వీరిలో ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 1,49,492 మంది ఉండగా ప్రైవేటు పాఠశాలల్లో 1,51,468 మంది ఉన్నారు. గతేడాది 'తల్లికి వందనం' పథకం అమలు కాలేదు. ఈ ఏడాది శుక్రవారం నుంచి ఈ పథకాన్ని ప్రారంభిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీనివల్ల డ్రాపౌట్స్ తగ్గి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య

▶ 2లో

పట్టిచ్చినా పట్టించుకోలేదు!

- గోడౌన్‌లో పాఠ్యపుస్తకాల అక్రమ అమ్మకం
- ఎస్ఎఫ్ఐ ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోని అధికారులు
- ఎంఇఒ కార్యాలయం వద్ద ధర్నా, వినతి

ప్రజాశక్తి-సత్తెనపల్లి

పట్టణంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలను యథేచ్ఛగా అమ్ముతున్నారనే అంశంపై భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నాయకులు బుధవారం కొన్ని విద్యాసంస్థలను సందర్శించారు. రైల్వే స్టేషన్ సమీపంలోని భాష్యం స్కూల్ ఆధ్వర్యంలో ఉన్న ఓ గోడౌన్‌లో పాఠ్యపుస్తకాలు అమ్ముతుండడాన్ని నాయకులు గుర్తించి నిలదీశారు. అయితే ఆ పుస్తకాల గోడౌన్‌కు తమకు సంబంధం లేదని పాఠశాల నిర్వాహకులు చెప్పారు. ఎంఇఒకు ఎస్ఎఫ్ఐ నాయకులు ఫిర్యాదు చేయడంతో ఎంఇఒ కార్యాలయం సిబ్బంది, సీఆర్పీ ఇందిరా పుస్తకాల గోడౌన్‌కు చేరుకున్నారు. పాఠ్యపుస్తకాల అక్రమ అమ్మకంపై ప్రశ్నించగా నిర్వాహకులు డొంకతిరుగుడు సమాధానమిచ్చినా ఆమె వెనుదిరిగి వెళ్లడంపై ఎస్ఎఫ్ఐ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎంఇఒ కార్యాలయం వద్ద ధర్నా

▶ 2లో

కౌలురైతులకు అన్నదాత సుఖీభవ

సిపిఎల్ఎ కార్యాలయం వద్దకు ప్రదర్శనగా వెళ్తున్న కౌలురైతులు, నాయకులు

- యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా గుర్తింపు కార్డులు
- సామూహిక రాయబారంలో కౌలురైతు సంఘం డిమాండ్

వార్త మెయిన్‌లో

14,15 తేదీల్లో యుఇఇయు రాష్ట్ర మహాసభ

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరులో ఈనెల 14, 15 తేదీల్లో నిర్వహించే యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ 11వ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు దుగ్గిరాల సూరిబాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు పోస్టర్‌ను బుధవారం స్థానిక సిఐటియు నగర కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ స్థానిక

▶ 2లో

మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

నేటి నుంచి బడిగంట

(మొదటి పేజీ తరువాయి)

కొంత వరకు పెరగవచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ నూతన విద్యా విధానం అమలులో భాగంగా విద్యా సంస్కరణల అమలుకు శ్రీకారం చుట్టిన కూటమి ప్రభుత్వం తొలి దశలో పలు పంచాయతీల్లోని పాఠశాలలను కుదింపునకు పూనుకుంది. అయితే ప్రతి పంచాయతీలో ఒక మోడల్ ప్రాథమిక పాఠశాల తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గతంలో 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడాన్ని నిలుపుదల చేస్తూ మోడల్ ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదు వరకు తప్పని సరిగా ఉండేలా నిర్ణయం తీసుకున్నారు. గుంటూరు జిల్లాలో 711, పల్నాడు జిల్లాలో 561 మోడల్ పాఠశాలలు ఏర్పాటు చేశారు. ఈ పాఠశాలల్లో కనీసం ఐదుగురు ఉపాధ్యాయులు ఉండేలా చూస్తున్నామని అధికారులు తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ప్రత్యేకంగా పాఠశాలల అభివృద్ధికి తీసుకున్న చర్యలు నామమాత్రంగానే ఉన్నాయి. గత ప్రభుత్వంలో నాడు-నేడులో నిలిచిపోయి నిధులు అందుబాటులో ఉన్న పాఠశాలల్లోనే పెండింగ్‌లో ఉన్న పనులు కొన్నింటిని పూర్తి చేశారు. తాజాగా ప్రాథమిక విద్యకు సంబంధించి పాఠశాలల హేతుబద్ధీకరణ, ఉపాధ్యాయుల కేటాయింపుతో మోడల్ పాఠశాలలను మాత్రం సిద్ధం చేశారు. దీనివల్ల రానున్న కాలంలో పెద్దఎత్తున ఉపాధ్యాయుల పోస్టుల సంఖ్య తగ్గుతుందని సీనియర్ ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు. మరోవైపు పాఠశాలలు తెరిచే రోజుకు ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియను ముగించాల్సి ఉన్నా మరో వారం పాటు ఈ ప్రక్రియ కొనసాగే అవకాశం ఉంది.

నేటి నుంచి సన్నబియ్యంతో భోజనం

డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలులో విద్యార్థులు తినేందుకు అనువుగా అన్నం నాణ్యతను పెంచేందుకు గురువారం నుంచి పాఠశాలలకు సన్నబియ్యం అందించనున్నారు. ఆరు రోజుల మోనూను కూడా సిద్ధం చేశారు. 2024-25లో గుంటూరు జిల్లాలో మొత్తం 1063 పాఠశాలలు ఉండగా వీటిల్లో 91,758 విద్యార్థులు ఈ పథకం ద్వారా భోజనం చేస్తున్నట్టు ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. పల్నాడు జిల్లాలో 1518 పాఠశాలలో 1,30,639 మంది గతేడాది విద్యాభ్యాస్యం చేసి ఈ పథకం ద్వారా లబ్ధిపొందారు.

విద్యామిత్ర కిట్‌లు సిద్ధం

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ 'విద్యార్థి మిత్ర కిట్'లు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 20లోపు పంపిణీ పూర్తికావాలని హెచ్ఎంలను ఆదేశించినట్టు జిల్లా విద్యాశాఖ అధికారి సి.వి.రేణుక తెలిపారు. అధికారులు ఇప్పటికే మండలాలకు ఈ కిట్లను చేరవేశారన్నారు. యూనిఫామ్, బెల్ట్, నోట్ బుక్స్, పాఠ్య పుస్తకాలు, వర్క్ బుక్స్, బ్యాగ్, బూట్లు, సాక్సులు, డిక్షనరీ కిట్లో ఉంటాయని ఆమె తెలిపారు.

పోలీసు స్టేషన్ ఎదుట డ్వాక్రా మహిళల ధర్నా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

తమ పేరుతో కొంత మంది బ్యాంకుల ద్వారా అక్రమంగా రుణాలు తీసుకున్నారని ఆరోపిస్తూ గుంటూరు రూరల్ మండలం చోడవరం డ్వాక్రా మహిళలు బుధవారం స్థానిక నల్లపాడు పోలీసు స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. అక్రమాలకు పాల్పడిన యానిమేటర్, సీవో, అధికారులు, బ్యాంకు ఉద్యోగులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 43 డ్వాక్రా పొదుపు సంఘాల పేరిట రూ.4 కోట్ల సొమ్మును అక్రమంగా రుణాలు గా తీసుకున్నారని వారు ఆరోపించారు. డ్వాక్రా మహిళలు ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేస్తామని సిఐ వంశీధర్ తెలిపారు.

కూటమి పాలనపై పెదవి విరుపులు

(మొదటి పేజీ తరువాయి)

అంశంపై అధికారులు నోరుపెదపడం లేదు. మూడు విడతలు కలిపి ఒకేసారి వినియోగదారుల ఖాతాల్లో జమ చేస్తామన్న ప్రకటించినా ఆచరణకు నోచుకోలేదు. సూపర్-6 తోపాటు ఇతర సంక్షేమ పథకాలు కూడా ఇంత వరకు పూర్తి స్థాయిలో అమలుకు చర్యలు లేవు. గురువారం నుంచి తల్లికి వందనం అమలు చేస్తామని ప్రకటించినా ఇందుకు సంబంధించి తమకు మార్గదర్శకాలు లేవని అధికారులు చెబుతున్నారు. పేకాట క్లబ్లులు తెరుచుకున్నాయి. రేషన్ మాఫియా, ఇసుక మాఫియా అన్ని ఎమ్మెల్యేల కనుసన్నల్లో కొనసాగుతోంది. బెల్టు షాపులు పెడితే బెల్టు తీస్తామని ప్రకటించారే తప్ప ప్రతి గ్రామంలో ఐదారు బెల్టు షాపులు ఉన్నా పట్టించుకునే పరిస్థితి లేదు.గత ప్రభుత్వంలో మాదిరిగానే కూటమి ప్రభుత్వంలో కూడా ఎమ్మెల్యేల కనుసన్నల్లో అక్రమ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి.

హామీలపై వీడని మందగమనం

సిఎం చంద్రబాబుతో పాటు మంత్రులు, పార్లమెంటు సభ్యులు ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలు అమలుకు సంబంధించి ఇప్పటి వరకు నిధుల కేటాయింపు లేదు. కొన్నింటికి కేటాయింపులు జరిగినా ఖర్చు చేయని పరిస్థితి నెలకొంది. ప్రధానంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వరికపూడిశెల ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తామని చంద్రబాబుతో పాటు సీనియర్ నాయకులంతా ప్రకటించారు. కానీ ఇంత వరకు ఈ పథకంపై కదలిక లేదు. రూ.80వేల కోట్ల అంచనాలతో బనకచర్ల ప్రాజెక్టుపై దృష్టి పెట్టిన ప్రభుత్వం రూ.1200 కోట్లతో పూర్తయ్యే వరికపూడిశెలను పట్టించుకోవడం లేదు. అలాగే గుంటూరు ఛానల్ విస్తరణ, పొడిగింపు పథకంలో కూడా మందగమనం కొనసాగుతోంది. 2025-26లో ఈ పథకంకు భూసేకరణ నిమిత్తం రూ.100 కోట్లు కేటాయించినా ఇంత వరకు ఇందుకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభం కాలేదు. గుంటూరులో నిలిచిపోయిన భూ గర్భ డ్రైనేజి పథకం పున: ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇచ్చే పరిస్థితుల్లో లేదని చెబుతూ ప్రజా ప్రతినిధులు కూడా ఈ అంశాన్ని పక్కన పెట్టారు. పలు నియోజకవర్గాల్లో తాగునీటి, సాగునీటి పథకాలకు నిధులు కేటాయిస్తామని, కూటమి ప్రభుత్వం రాగానే పూర్తి చేస్తామని ప్రకటించినా ఇంత వరకు ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన కన్పించడం లేదు. గత ప్రభుత్వం హయంలో అధ్వానంగా ఉన్న రహదారులకు మాత్రం తొలి ఏడాదిలో గుంతలను పూడ్చే పనులు చేపట్టారు. అలాగే జిల్లాలోని ప్రధాన మార్గాల్లో రహదారులకు ప్రైవేటు సంస్థల ఆధ్వర్యంలో నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. తద్వారా ఈ మార్గాల్లో టోల్ గేట్లు పెట్టి వసూలుకు అనుమతి ఇస్తారు.

ఆర్‌వోబీల నిర్మాణంపై కదలిక

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో రైల్వే క్రాసింగ్‌లపై ఆర్‌వోబిల నిర్మాణంకు కేంద్రం నుంచి అనుమతులు తేవడంపై కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపి లావు శ్రీకృష్ణ దేవరాయులు దృష్టి సారించారు. గుంటూరులో నాలుగు, తెనాలి, నిడమర్రులో ఒకటి చొప్పున ఆర్‌వోబిలను కేంద్ర మంత్రి చంద్రశేఖర్ అనుమతులు తెచ్చారు. కీలకమైన శంకర్ విలాస్ బ్రిడ్జినిర్మాణంకు నిధులు మంజూరుకు ఆయన తొలి ప్రాధాన్యత ఇచ్చారు. రాజధానిలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌తో పాటు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఈఎస్ఐ ఆస్పత్రి, కేంద్ర విద్యాలయాలు కేంద్ర ప్రాజెక్టులకు నిధుల సమీకరణలో పెమ్మసాని దృష్టిసారించారు. మరోవైపు నరసరావుపేట పార్లమెంటు పరిధిలో కొండమోడు-పేరేచర్ల రహదారి నిర్మాణంపై కృష్ణదేవరాయులు దృష్టి సారించారు. పల్నాడులో గతంలో పెండింగ్‌లో ఉన్న పలు పథకాల అమలుకు ఆయన కేంద్ర నుంచి నిధుల మంజూరుకు కృషి చేస్తున్నారు.

14,15 తేదీల్లో యుఇఇయు రాష్ట్ర మహాసభ

(మొదటి పేజీ తరువాయి)

బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో రెండ్రోజులపాటు జరిగే మహాసభల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి ప్రతినిధులు హాజరై విద్యుత్ రంగంలో ప్రభుత్వ విధానాలు, వినియోగదారుల సమస్యలు, ఉద్యోగుల సమస్యలపై చర్చించి, భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకుంటామని చెప్పారు. విద్యుత్ రంగ ప్రైవేటీకరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యత్నిస్తున్నాయని, ఫలితంగా వినియోగదారులపై ఇటీవల పెద్ద ఎత్తున భారాలు మోపాయని అన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ షిర్డీ సాయి వంటి ప్రైవేటు సంస్థలకు అప్పగించటం వల్ల వాటి నిర్వాహణలో పెద్ద ఎత్తున లోపాలు తలెత్తుతున్నాయన్నారు. ఇప్పటికే ఉద్యోగులకు 3 డిఏలు పెండింగ్లో ఉన్నాయన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ప్రధానంగా చర్చిస్తామన్నారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా రివర్స్ అమలు జరిపి ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారన్నారు. జెఎల్ఎం గ్రేడ్ 2లను గాంధీ జయంతి రోజు ఉద్యోగులుగా తీసుకొని నేటికీ వారిని గాలిలో దీపంలాగా ఉంచారన్నారు. వారి సమస్యలపై మహాసభలో చర్చించనున్నామని చెప్పారు. ఈ మహాసభకు మొదటి రోజు ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ కోశాధికారి ఎస్.రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారన్నారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి.నాగేశ్వరరావు, సిహెచ్.నరసింగారావు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కె.ఈశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుదర్శన్‌రెడ్డి, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ముజఫర్ అహ్మద్ పాల్గొంటారన్నారు. పోస్టర్ ఆవిష్కరణలో రాష్ట్ర ఉపాధ్యక్షులు సి. హెచ్.నాగబ్రహ్మాచారి, జిల్లా గౌరవాధ్యక్షులు బి.లక్ష్మణరావు, అధ్యక్షులు రాంప్రభాకర్, వేణు పాల్గొన్నారు.

పట్టిచ్చినా పట్టించుకోలేదు!

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టారు. ఎంఇఒ రాఘవేంద్రరావుకు వినతిపత్రం ఇచ్చారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు డి.అమూల్య మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు పుస్తకాలను తమవద్దే కొనాలంటూ నిబంధన పెట్టడంతోపాటు వేలకువేల డబ్బును గుంజుతున్నారని, ఇది తల్లిదండ్రులకు పెనుభారమ వుతోందని ఆవేదన వెలిబుచ్చారు. నిబంధనలు మీరుతున్న పాఠశాలలపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నందు, షాహిద్, సలీం, దివ్య, కృష్ణ, రవి, డివైఎఫ్ఐ నాయకులు జె.రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్డెక్కిన కౌలు రైతులు

సమస్యలు పరిష్కరించాలని ధర్నాలో నాయకుల డిమాండ్

ప్రజాశక్తి మంగళగిరి

రాష్ట్రంలో కౌలుదారులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, అన్నదాత సుఖీభవ పథకంలో రూ.20 వేలు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఇవ్వాలని నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మంగళగిరి ఆటో నగర్ లో గల సీసీఎల్‌ఏ కార్యాలయం వద్ద, వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా చేసి అనంతరం ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేయడం జరిగింది. ఆల్ఫా హోటల్ సెంటర్లో కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో సభ జరిగింది. రాష్ట్ర వ్యాపితంగా భారీ సంఖ్యలో కౌలు రైతులు హాజరయ్యారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు, ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కష్ణయ్య మాట్లాడారు. రాష్ట్రంలో కౌలు రైతుల మీదే ఆధారపడి వ్యవసాయం సాగు అవుతుందని అన్నారు. 70 శాతం భూములు కౌలు రైతులే సాగు చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం ద్వారా ఎటువంటి సబ్సిడీలు లేక విత్తనాలకు ఎరువులకు పురుగుమందులకు అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి వారే పెట్టుబడులు పెట్టి పంటలు పండిస్తున్నారని అన్నారు. అలాంటి కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వకుండా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గత ప్రభుత్వం కౌలుదారుల గురించి పట్టించుకోలేదని, ఎన్నికలకు ముందు కూటమి నాయకులు కౌలుదారుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు గాని అమలు చేయడం లేదని విమర్శించారు. మాట్లాడుతూ పెద్ద రైతులు అంతా వ్యవసాయం చేయకుండా వ్యాపారం చేసుకుంటున్నారని అన్నారు. వారి భూములను కౌలుకు తీసుకొని వ్యవసాయ కార్మికులు వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు. వారి సమస్యలు పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. కరోనాకాలంలో ప్రాణాలు పోతున్నప్పటికీ కౌలు రైతులు భయపడకుండా వ్యవసాయం చేసి రాష్ట్ర ప్రజలకు ఆహార ఉత్పత్తులను అందించడం జరిగిందని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కౌలు రైతులకు ఎన్నికలకు ముందు ఓటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను మాత్రమే మనం అమలు చేయమని పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డు లేకపోవడం వలన ఎలాంటి సహాయం ప్రభుత్వం నుండి అందడం లేదని అన్నారు. అనంతరం సీసీఎల్‌ఏ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. అనంతరం భూ పరిపాలన శాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. అక్కడనుండి వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులకు వినతి పత్రం అందజేయడం జరిగింది. సీసీఎల్‌ఏ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో రైతులు మెడలకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న విధానాన్ని కౌలు రైతులు చూపించారు. కార్యక్రమంలో వివిధ జిల్లాల నుండి వచ్చిన కౌలు రైతు సంఘం నాయకులు టి గోపాల్, ఎం రామాంజనేయులు, బాల రంగారావు, సీతారెడ్డి, నాగమల్లేశ్వరరావు, పాశం రామారావు, బి కోటేశ్వరి, వివిధ జిల్లాలకు చెందిన రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పివి ఆంజనేయులు, ఏ గోపాల్ రావు, కే కళ్యాణ్, ఈమని అప్పారావు, కే శివ నాగేశ్వరరావు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న వి కృష్ణయ్య

అధికారులకు వినతి పత్రం ఇస్తున్న ఎం హరిబాబు, వి వెంకటేశ్వర్లు, పాశం రామారావు తదితరులు

ఉరివేసుకుని నిరసన తెలుపుతున్న కౌలు రైతులు

పేరు మార్పు / సవరణ

నేను నాగరాజు నేలపాటి, S/o నేలపాటి సోమయ్య, నివాసం: డోర్ నెం. 24-66, విజయభాస్కర్‌నగర్, పెదకాకాని మండలం, నంబూరు, గుంటూరుజిల్లా.

ప్రస్తుత ఆధార్‌లో నా కుమారుడి పేరు నేలపాటి రిత్విక్ అని నమోదు కాబడినది. పేరు మార్పు / సవరణ చేయగా 10వ తరగతి మార్కుల లిస్టు ఆధారంగా **నేలపాటి రాజ్ S/oనేలపాటి నాగరాజు (Nelapati Raj S/o Nelapati Nagaraju)** గా మార్పు చేయుట జరిగినది. కావున నేటి నుండి నా కుమారుడి పేరు నేలపాటి రాజ్‌గా పిలవబడును. ఆధార్‌లో మార్పు కొరకు.

లింకు దస్తావేజు పోయినవి

పల్నాడు జిల్లా పిడుగురాళ్ల కు చెందిన వీసం తులశీ లక్ష్మి భర్త శ్రీధర్ కు చెందిన లింకు దస్తావేజు పోయినది. 2004వ సంవత్సరంలో పిడుగురాళ్ళ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దస్తావేజు నెంబర్ 108/2004 గా రిజిస్టర్ కాబడిన డి.నెంబర్ 205 లో 137.64 చ.గజముల స్థలానికి సంబంధించిన లింకు దస్తావేజు అయిన దఖలు దస్తావేజు నెంబర్ 75/2000 ను పిడుగురాళ్ల లోని మా యింటి నుండి ఫొటోస్టాట్ తీయించుటకు సెంటర్ కు వెళ్లుచుండగా మార్గమధ్యంలో పోయినది. దొరికిన వారు ఈ క్రింది చిరునామాకు తెలియపరచగలరు. స్వయంగా తెచ్చి ఇచ్చిన వారికి తగిన పారితోషికం ఇవ్వబడును.

ఇట్లు
వీసం తులశీ లక్ష్మి, భర్త శ్రీధర్
పిడుగురాళ్ల, పల్నాడు జిల్లా.
సెల్ నెం.9059316944

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి - దుగ్గిరాల

స్థానిక పాతలాకుల వద్ద తెనాలి విజయవాడ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. రేపల్లె మండల రూరల్ గ్రామం మత్యుంజయ పాలెం గ్రామానికి చెందిన ఏసీ మెకానిక్ ఏమినేని మాణిక్యరావు విజయవాడ నుండి తెనాలి వైపు ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో అదుపుతప్పి ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. కుడికాలు మోకాలు కింద, కుడి చేతికి తీవ్రంగా గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. క్షతగాత్రుని తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

గాయపడిన మాణిక్యరావు

మాట్లాడుతున్న పల్నాడు జిల్లా అధ్యక్షులు అద్దంకి బాబు,

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక దినోత్సవాన్ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-ఈపూరు

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ పోరాటాలతో మాదిగల హక్కులను సాధించగలిగామని పల్నాడు జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు అద్దంకి బాబు అన్నారు. మండల కేంద్రమైన ఈపూరు గ్రామంలో జులై 7వ తేదీన జరిగే ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేలా ఎమ్మార్పీఎస్ నాయకులకు దిశా నిర్దేశం చేశారు. భవిష్యత్తులో మందకృష్ణ మాదిగ తీసుకోబోయే నిర్ణయాలకు మాదిగ జాతి అండగా నిలవాలని కోరారు. ఎమ్మార్పీఎస్ నాయ కులు కార్యకర్తలు సమన్వయంతో ఆవిర్భావ వేడుకలను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో కందుకూరి శ్యామ్ మాదిగ, రెడ్డిబోయిన ఠాగూర్ మాదిగ, మాజీ జెడ్పిటిసి బందెల కన్నయ్య మాదిగ, స్వర్ణ ముసలయ్య మాదిగ, ఉప్పులూరి రామయ్య మాదిగ, ఆలేటి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్ల పురపాలక సంఘం కౌన్సిల్ సాధారణ సమావేశము గురువారం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమి షనర్ డి.వేణుబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చైర్‌పర్సన్ షేక్ మదార్‌సాహెబ్ అధ్యక్షతన జరిగే సమా వేశానికి మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి హాజరు అవుతున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 3గంటలకు ప్రారంభమయ్యే సమా వేశానికి కౌన్సిలర్లు అందరూ హాజరు కావాలని, అధికారులు అందుబాటులో వుండాలని కమిషనర్ సూచించారు.

బాలుని అదృశ్యంపై కేసు

ప్రజాశక్తి - తెనాలి

కూలి పనులకు వచ్చిన కుటుంబంలో బాలుడు అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణ 3 టౌన్ పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం అస్సాంకు చెందిన ఓ కుటుంబం ఇటుక పనుల నిమిత్త తెనాలి సుల్తానాబాద్‌కు వచ్చి ఉంటున్నారు. వీరి కుటుంబంలోని 13 ఏళ్ల బాలుడు గౌలా మే 27 నుండి కనబడకుండా పోయాడు. గాలించినా ఫలితం లేకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించగా బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

మహారాజశ్రీ
మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్. 45/2024

నాదేళ్ల సుబ్రమణ్యం .... వాది

వర్సెస్

రమేష్‌కుమార్ టంకే మరియు ఒకరు..ప్రతివాదులు

టు,
డి-2.
తాతపూడి స్టీఫెన్ ప్రభాకర్ పౌల్,
తండ్రి: పౌల్,డోర్ నెం: 1-33/58/ఎ/1,
నేతాజీ నగర్, ఎస్‌విఎన్ కాలనీ,
గుంటూరు, గుంటూరు జిల్లా.

పై నెంబరు దావాను వాది, మీ పైన షెడ్యూలు భూముల గురించి ఇంజంక్షన్ ఉత్తర్వులు కోరుచూ దావాను దాఖలు చేసి ఉన్నారు. ఈ దావా నందు మీకు ఎన్ని పర్యాయములు కోర్టు వారి ద్వారా సమనులు పంపిననూ తీసుకొనుట లేని కారణంగా కోర్టు వారు పేపరు ప్రకటన ద్వారా సమను జారీ చేయమని ఆర్డర్ వేసియున్నారు. కావున మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల వాయిదా 25-06-2025వ తేదీ ఉదయం 10:30 గంటలకు మీరు స్వయముగా కానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేని యెడల మీ పరోక్షమందు విమర్శచేసి తీర్మానించబడునని ఖండితముగా తెలియజేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వులతో //
వి.శ్రీనివాసరావు ,
వై.కోటేశ్వరరావు,
అడ్వకేట్స్, మార్కాపురం.

మహారాజశ్రీ గౌరవనీయులైన ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టు, సత్తెనపల్లి,
ఓ.యస్ నెం. 107/2020

బిట్వీన్
జొన్నలగడ్డ చిన ఆదియ్య .... వాది

అండ్

పచ్చా సీతామహాలక్ష్మీ అండ్ 3 ఇతరులు ... ప్రతివాది

టు,
డి1 : పచ్చా సీతామహాలక్ష్మీ భర్త (లేటు) బ్రహ్మానందం, వయస్సు 59 సంవత్సరాలు, హౌస్ వైఫ్ రెసిడెంట్ ఆఫ్ పొనుగుబాడు గ్రామం, ఫిరంగిపురం మండలం, గుంటూరు జిల్లా.
డి2 : పచ్చా చంద్రశేఖర్ తండ్రి (లేటు) బ్రహ్మానందం, వయస్సు: 31 సంవత్సరాలు, ప్రైవేట్ జాబ్ రెసిడెంట్ ఆఫ్ పొనుగుబాడు గ్రామం. ఫిరంగిపురం మండలం, గుంటూరు జిల్లా.
డి4 : మాదల అనూష భర్త శ్రీనివాసరావు, వయస్సు 36 సంవత్సరాలు, గృహిణి రెసిడెంట్ ఆఫ్ పాలడుగు గ్రామం, మేడికొండూరు మండలం, గుంటూరు జిల్లా,

పై నెంబరు గల దావాలో శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం దావా నిమిత్తం మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపెననూ ఈ దావా వ్యవహారం మీకు తెలిసి కూడా మీరు నోటీసులు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. కనకు ఈ పేపరు నోటీసు ద్వారా శ్రీ కోర్టు వారి ఎదుట ది. 16-06-2025న వాయిదా అయ్యి ఉన్నది. కావున పై తెలిపిన వారు వాయిదా తేదీన ఉదయం గం. 10-30 ని॥ లకు శ్రీ కోర్టువారి ఎదుట వాయిదాకు మీరు వ్యక్తిగతంగా గాని లేదా మీ లాయరు ద్వారా హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపగలరు. లేనియెడల మీ పరోక్షమందు శ్రీ కోర్టువారు తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా ది. 16-06-2025,
సత్తెనపల్లి.

ఇట్లు
పెండెం బాబూరావు
అడ్వకేట్, సత్తెనపల్లి.
సెల్: 7981010910



మహిళకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న వెంకట్రావు కుటుంబ సభ్యులు

30 మంది నిరుపేదలకు సరుకులు పంపిణీ

ప్రజాశక్తి-సత్తెనపల్లి

గుండవరపు అనిల్‌కుమార్ సేవలు వెలకట్టలేనివని గోశాల అధ్యక్షులు పెండ్యాల కాశి మల్లేశ్వరరావు అన్నారు. బుధవారం సాయంత్రం పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని వంగర బ్రహ్మయ్య చేనేత కాలనీలో గంజి వీరాస్వామి ఆద్వర్యంలో పల్నాడు జిల్లా, అమరావతి మండలంలోని ఉంగుటూరు గ్రామానికి చెందిన గుండవరపు వెంకట్రావు జ్ఞాపకార్థం వీరి కుమారుడు ఎన్‌ఆర్‌ఐ గుండవరపు అనిల్‌కుమార్ ధర్మపత్ని జయశ్రీ ఆర్థిక సహాయంతో 30 మంది నిరుపేదలకు, వృద్ధులకు ఒక్కొక్కరికి రూ. 500లు విలువ చేసే నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం (మొత్తం రూ.15,000లు ఖర్చు) జరిగింది. ఈ కార్యక్రమంలో బుధవారం గుండవరపు అనిల్ కుమార్ కుమారుడు అభిరామ్‌జన్మదిన సందరంగా ఇదే 30 కుటుంబాలుకు ఒక్కోక్కరికి రెండు కిలోల మామిడి పండ్లు, కూరగాయలు, స్నాక్స్, సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలలో డొక్కా సీతమ్మ అన్నప్రసాద వితరణ పథకంలో 140 మందికి ఉచితంగా భోజనం అందించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పెండ్యాల కాశీ మల్లేశ్వరరావు, కట్టా శివ దుర్గారావు,దివ్వెల శ్రీనివాసరావు, గంగూరు కళ్యాణ్,గంగూరి విద్య, అప్పాపురపు నరేంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమా నికి కోఆర్డినేటర్లుగా గంగూరికల్యాణ్, కంచర్ల చిననాగేశ్వరరావు, గంగూరి సోమనాథ్ వ్యవహరించారు. ఈ సందర్భంగా గంజి వీరాస్వామి మాట్లాడుతూ ఈనాటి కార్యక్రమం లో దాతలు గుండవరపు వెంకట్రావు జ్ఞాపకార్థం వీరి ధర్మపత్ని శివపార్వతి, వారి కుమారుడు గుండవరపు అనిల్ కుమార్ ధర్మపత్ని జయశ్రీ వీరి కుమారుడు గుండవరపు అభిరామ్ , కుమార్తె గుండవరపు ప్రణవికి హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో షేక్ జానీ వందన సమర్పణ చేశారు.

మహారాజశ్రీ
మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఐ.ఎ. 854/2024
ఇన్
ఓ.ఎస్. 45/2024

నాదేళ్ల సుబ్రమణ్యం .... పిటీషనర్/వాది

వర్సెస్

రమేష్‌కుమార్ టంకే మరియు ఒకరు
..... రెస్పాండెంట్లు/ప్రతివాదులు

టు,
ఆర్-2.
తాతపూడి స్టీఫెన్ ప్రభాకర్ పౌల్,
తండ్రి: పౌల్, డోర్ నెం: 1-33/58/ఎ/1,
నేతాజీ నగర్, ఎస్‌విఎన్ కాలనీ, గుంటూరు,
గుంటూరు జిల్లా.

పై నెంబరు దావాను వాది, మీ పైన షెడ్యూలు భూముల గురించి ఇంజంక్షన్ ఉత్తర్వులు కోరుచూ దావాను దాఖలు చేసి ఉన్నారు. ఈ దావా నందు మధ్యంతర ఉత్తర్వులు కోరుచూ ఐ.ఎ. 854/2024 నెంబరున ఐ.ఎ.ను దాఖలు చేసి ఉన్నారు. ఈ ఐ.ఎ. నందు కోర్టు వారి ద్వారా నోటీసులు పంపిననూ తీసుకొనుట లేని కారణంగా కోర్టు వారు పేపరు ప్రకటన ద్వారా ఐ.ఎ. నోటీసులు జారీ చేయమని ఆర్డర్ వేసి యున్నారు. కావున మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల వాయిదా 25-06-2025వ తేదీ ఉదయం 10:30 గంటలకు మీరు స్వయముగా కానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేని యెడల మీ పరోక్షమందు విమర్శచేసి తీర్మానించబడునని ఖండితముగా తెలియజేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వులతో //
వి.శ్రీనివాసరావు ,
వై.కోటేశ్వరరావు,
అడ్వకేట్స్, మార్కాపురం.

మహారాజశ్రీ
మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఐ.ఎ. 855/2024
ఇన్
ఓ.ఎస్. 45/2024

నాదేళ్ల సుబ్రమణ్యం .... పిటీషనర్/వాది

వర్సెస్

రమేష్‌కుమార్ టంకే మరియు ఒకరు
..... రెస్పాండెంట్లు/ప్రతివాదులు

టు,
ఆర్-2.
తాతపూడి స్టీఫెన్ ప్రభాకర్ పౌల్,
తండ్రి: పౌల్, డోర్ నెం: 1-33/58/ఎ/1,
నేతాజీ నగర్, ఎస్‌విఎన్ కాలనీ, గుంటూరు,
గుంటూరు జిల్లా.

పై నెంబరు దావాను వాది, మీ పైన షెడ్యూలు భూముల గురించి ఇంజంక్షన్ ఉత్తర్వులు కోరుచూ దావాను దాఖలు చేసి ఉన్నారు. ఈ దావా నందు మధ్యంతర ఉత్తర్వులు కోరుచూ ఐ.ఎ. 855/2024 నెంబరున ఐ.ఎ.ను దాఖలు చేసి ఉన్నారు. ఈ ఐ.ఎ. నందు కోర్టు వారి ద్వారా నోటీసులు పంపిననూ తీసుకొనుట లేని కారణంగా కోర్టు వారు పేపరు ప్రకటన ద్వారా ఐ.ఎ. నోటీసులు జారీ చేయమని ఆర్డర్ వేసి యున్నారు. కావున మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల వాయిదా 25-06-2025వ తేదీ ఉదయం 10:30 గంటలకు మీరు స్వయముగా కానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేని యెడల మీ పరోక్షమందు విమర్శచేసి తీర్మానించబడునని ఖండితముగా తెలియజేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వులతో //
వి.శ్రీనివాసరావు ,
వై.కోటేశ్వరరావు,
అడ్వకేట్స్, మార్కాపురం.

పత్రికా ప్రకటన
మహారాజశ్రీ గుడివాడ 11వ అదనపు జిల్లా కోర్టు, కృష్ణా జిల్లా, గుడివాడ వారి కోర్టులో
ఓ.యస్.నెం.27/2022

బిట్విన్:
నూకల వెంకట శేషగిరి రావు,
తండ్రి: లింగమూర్తి, యాకమూరు ..... వాది

మరియు

కంచర్ల మోహన్‌రావు, తండ్రి: వెంకటేశ్వరరావు,
హిందువు, వయస్సు: 53 సం.లు., వ్యాపారం,
నివాసం: యఫ్-301, డి.జె. రత్నం టవర్స్,
బ్రాడీపేట, 6/13, గుంటూరు గుంటూరు జిల్లా.
... ప్రతివాది

పై నెంబరు దావాలో శ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారం పై ప్రతివాదికి సమన్లు పేపరు పబ్లికేషన్ ద్వారా సర్వ్ చేయుటకు పై నెంబరు గల దావాను ది.01-07-2025 వ తేదీకి వాయిదా వేసియున్నారు. సదరు తేదిన పై ప్రతివాది స్వయంగా గాని, వారి అడ్వకేట్ వారి ద్వారా గాని పై కోర్టులో ఉదయం గం.10.30 ని॥ లకు హాజరు కావలెను. అట్లు హాజరు కాని యెడల పై నెంబరు గల దావా పై ప్రతివాది పరోక్షమందు వారికి వ్యతిరేకంగా తీర్మానించబడునని యిందుమూలముగా తెలియపరచడమైనది.

// శ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారం //

గుడివాడ,
తేది: 08-06-2025

కె.వి.రామకృష్ణా రెడ్డి,
అడ్వకేట్,
గుడివాడ-521 301. కృష్ణాజిల్లా
సెల్ నెం.9490881180

రైతు, రైతుకూలీలు సంతోషంగా ఉండాలి

ఏరువాక పౌర్ణమిలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
పంటకు ప్రభుత్వం మద్దతు ధర కల్పించాలని డిమాండ్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

దక్షిణాది రైతులకు ఏరువాక పౌర్ణమి మొదటి పండుగ అని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఏరువాక సందర్భంగా బుధవారం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి రొంపిచర్లలో పర్యటించి, ఏరువాక పౌర్ణమి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలు బాగా పండాలని, రైతులు, రైతు కూలీలు సంతోషం గా ఉండాలని ఆకాంక్షించారు. వైసిపి హయాంలో రైతులంతా సంతోషంగా ఉన్నారనీ, ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి విత్తనాలు, ఎరువులు రైతుల చెంతకు చేర్చామని పంటల బీమా అమలు చేయడంతో పాటు మద్దతు ధరకు పంటలను కొనుగోలు చేశామని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతు భరోసా కేంద్రాల పేరు మార్చి సేవలను నిర్వీర్యం చేశారనీ, పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు మెరుగైన సేవలు, సలహాలు, సూచనలు అందజేయాలన్నారు. అన్నదాత సఖీభవ పథకం కింద ఇస్తామని ప్రకటించిన రూ 20 వేలు పెట్టుబడి సాయం రైతులతో పాటు కౌలు రైతులకు అందజేయాలని అన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించి, పంటనలను మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైసిపి పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు పచ్చవ రవీంద్ర బాబు, మండల కన్వీనర్ కె.శ్రీనివాస రెడ్డి, నాయకులు పడాల చక్రారెడ్డి, పోనుగోటి వెంకట్రావు, రైతు విభాగం నాయకులు అన్నెం పున్నారెడ్డి అధిక సంఖ్యలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

16న కలెక్టరేట్‌లో మెగా రుణమేళా

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జిల్లాలోని రైతులకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల్లో అర్హులైనవారికి విరివిగా రుణాలు అందించాలని బ్యాంక్ అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు కోరారు. వారితో సోమవారం సమావేశమైన కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 16న సోమవారం నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో మెగా లోన్ మేళా, అవగాహన సదస్సు నిర్వహిస్తామన్నారు. లబ్ధిదారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల రుణాలు సులువుగా అందేలా బ్యాంకర్లతో కలెక్టరేట్‌లో మెగాలోన్ మేళా ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.

పలువురు అధికారుల బదిలీ

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలో పలు అధికారులు బదిలీ అయ్యారు. ఎంపిడిఒ కొండారెడ్డి ప్రభాకర్ మేడికొండూరుకు, ఏవో శాంతి నరసరావుపేటకు బదిలీ కాగా బెల్లంకొండ ఏవో డి.కృష్ణయ్యను పెదకూరపాడుకు కేటాయించారు. పెదకూరపాడు ఉద్యాన శాఖాధికారి శ్రీనిత్యను తెనాలికి కేటాయించి మాచర్ల ఉద్యాన శాఖాధికారి సురేష్‌ను ఇక్కడ నియమించారు. మండలంలోని తాళ్లూరు పశువైద్యాధికారి శ్రీదేవిని సత్తెనపల్లి మండలం పెదమక్కెనకు బదిలీ చేశారు. రాజుపాలెం మండలం గణపవరం పశువైద్యాధికారి శివకుమారిని తాళ్లూరుకు, గారపాడు పశువైద్యాధికారిగా మోర్జంపాడు అధికారిని నియమించారు.

ప్రజాశక్తి - యడ్లపాడు

మండల నూతన వ్యవసాయాధికారిగా ఎ.హరిప్రసాద్ నాదెండ్ల నుండి బదిలీపై వచ్చారు. యడ్లపాడు వ్యవసాయ అధికారిగా పనిచేస్తున్న సరిత చిలకలూరిపేట మండలానికి బదిలీ అవ్వగా, చిలకలూరిపేట ఏవోగా పనిచేస్తున్న శ్రీలత నాదెండ్ల మండలానికి బదిలీ అయ్యారు. వీరు ఇప్పటికే విధుల్లో చేరారు.

ముగిసిన ఫుట్‌బాల్ శిక్షణ శిబిరం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణా శిబిరం బుధవారంతో ముగిసింది. పల్నాడు జిల్లా ఫుట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు కె.సుబ్రహ్మణ్యేశ్వరరావు పర్యవేక్షణలో 40 మంది బాలికలు, 50 మంది బాలురకు ఏప్రిల్ 26 నుంచి జూన్11 వరకు 45 రోజుల పాటు శిక్షణిచ్చారు. శిక్షణ పూర్తి చేసిన వారికి పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. జనసేన నాయకులు ఆర్.సుమన్, కె.రామకృష్ణ, మూడో వార్డ్ కౌన్సిలర్ శ్రీనివాసరావు, టిడిపి నాయకులు షేక్ గౌస్ ఉమర్ రఫీ, పిఇటిలు నాగిరెడ్డి, అచ్చిరెడ్డి, శ్రీరామ్‌రెడ్డి, శ్రీనివాసరావు, నరసింహారావు, రియాజ్, మస్తాన్‌వలి, స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలపై అడ్డగోలు వ్యాపారం!

- పాఠశాల ఫీజుల విషయంలోనూ ప్రభుత్వ నిబంధనలు మీరి వసూళ్లు
- తీవ్ర ఆర్థిక దోపిడీకి గురవుతున్న తల్లిదండ్రులు - డబ్బులు చెల్లించేందుకు నానా తంటాటు
- ప్రేక్షకపాత్రకే అధికారులు పరిమితం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ప్రభుత్వ నిబంధనల ప్రకారం గుర్తింపు పొందిన పాఠశాలల్లో ప్రభుత్వ పాఠ్యపుస్తకాల్లోని పాఠ్యాంశాలను మాత్రమే బోధించాలి. వారి విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఎంఇఒ కార్యాలయం ద్వారా పాఠ్యపుస్తకాలు తెప్పించి ఆ ధరకే విద్యార్థులకివ్వాలి. నోట్ పుస్తకాలను విద్యార్థుల తల్లిదండ్రులే సమకూర్చుకోవచ్చు. అయితే ఈ నిబంధనలను ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నాయి. తామే కోటేషన్ ఇచ్చి పుస్తక తయారీదార్ల వద్ద తక్కువ ధరలకు పుస్తకాలను కొనుగోలు చేసి ఎంఆర్‌పి ధరలను పాఠశాలలే నిర్ణయిస్తున్నాయి. బహిరంగ మార్కెట్లో ఎంఆర్‌పి రూ.50 ఉన్న పుస్తకం పాఠశాలకు రూ.35కు వస్తుండగా రూ.50కే విద్యార్థులకు అమ్ముతున్నాయి. యూనిఫాం, టై, బెల్టు, బ్యాడ్జీ, షూ, సాక్స్ ఇలా అన్నీ తమవద్దే కొనాలని తల్లిదండ్రులకు హుకుం జారీ చేస్తున్నాయి. వారు చెప్పిన ధర చెల్లించి వాటిని సమకూర్చుకోవాల్సిన దుస్థితి విద్యార్థుల తల్లిదండ్రులకు నెలకొంది.

మండలంలో 55 ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలున్నాయి. వీటిలో పూర్తిస్థాయి వసతులున్న పాఠశాలలను వేళ్లపైనే లెక్కపెట్టొచ్చు. ఆటస్థలాలు అసలే ఉండవు. అయినా రకరకాలుగా ఫీజులను వసూలు చేయడంలో మాత్రం ఏమాత్రమూ వెనక్కు తగ్గకుండా తల్లిదండ్రులపై భారాలమీద భారాలు వేస్తున్నాయి. కానీ విద్యాశాఖాధికారులకు మాత్రం ఇవేమీ పట్టవు. ప్రభుత్వ ధరల ప్రకారం ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు పాఠ్య పుస్తకాల ధరలు రూ.280 నుంచి 700 వరకు ఉండాలి. దీనికి నోట్ పుస్తకాలను కలిపినా గరిష్ఠంగా రూ.1500 మించదు. అయితే ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఎల్‌కెజి, యుకెజి పుస్తకాలే రూ.3 వేల నుండి రూ.5 వేలు, ఆపై తరగతులకు రూ.7 వేల నుండి 12 వేల వరకు ఉంటున్నాయి. రూ.కోట్లల్లో జరుగుతున్న ఈ దోపిడీపై విద్యార్థి సంఘాలు ఆందోళన చేసినా, ఏదైనా పాఠశాలలో పుస్తకాల విక్రయాలను అడ్డుకుని అధికారులను సంప్రదించినా నామమాత్రపు చర్యలతోనే సరిపెడుతున్నారు.

ఇదంతా ఒకెత్తయితే పాఠశాల ఫీజుల దోపిడీకైతే అంతేలేదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒకటో తరగతి నుంచి మూడో తరగతి వరకు గ్రామీణ ప్రాంతాల్లో రూ.6 వేలు, మండల కేంద్రాల్లో రూ.7,500, పట్టణాల్లో 8,600, జిల్లా కేంద్రంలో రూ.10 వేలు చొప్పున ఫీజులు నిర్ధారించారు. 4, 5 తరగతులకు గ్రామీణ ప్రాంతాల్లో ఏడాదికి రూ.9 వేలు, పట్టణాల్లో రూ.10,600, జిల్లా కేంద్రంలో రూ.12 వేలు, ఆరో తరగతికి గ్రామీణ ప్రాంతాల్లో రూ.9 వేలు, మండల కేంద్రాల్లో 4, 5 తరగతులకు రూ. 9,500, పట్టణాల్లో రూ.11,100 చొప్పున పాఠశాల స్టార్ రేటింగ్ మేరకు ప్రభుత్వం నిర్ణయించింది. వాస్తవానికి ఏ పాఠశాలలో ఎంత ఫీజు వసూలు చేస్తున్నారో ప్రాంతాల వారీగా కమిటీ పరిశీలించి నివేదికను ప్రభుత్వానికి గతంలోనే అందించింది. అయితే ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులు సైతం అమలు కాకుండా తమకు తోచిన రీతిలో యాజమాన్యాలు దోచుకుంటున్నాయి. చిలకలూరిపేట పట్టణంలోని నరసరావుపేట సెంటర్లో కొత్త పేరుతో ప్రారంభించబోతున్న పాఠశాలలో ఒకటో తరగతికి ఏకంగా రూ.35 వేల ఫీజు వసూలు చేస్తున్నారు. వసూలు చేస్తున్న ఫీజుల వివరాలను నోటీసు బోర్డులో ప్రదర్శించాలనే నిబంధననూ పాటించడం లేదు. విద్యాహక్కు చట్టం ప్రకారం 25 శాతం సీట్లను పేదలకు కేటాయిస్తున్న దాఖలాలూ లేవు. కొన్ని పాఠశాలల్లో ఉచిత సీట్లు కేటాయించినా ప్రభుత్వం నుండి ఫీజులు జమ కాకుండా ఆ మొత్తమూ తల్లిదండ్రులే చెల్లించాలంటూ లిఖితపూర్వక హామీని తీసుకుంటున్నారు. మొత్తంగా పాఠశాలలు మోపే ఫీజుల కోసం తల్లిదండ్రులు అప్పుల పాలవుతున్నారు. దీనిపై అధికారులు స్పందించాలని, ప్రతి పాఠశాలలోనూ తనిఖీలు చేపట్టి నిబంధనలు అమలయ్యేలా చూడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

పొలాల్లో ఎమ్మెల్యేల దుక్కులు

ప్రజాశక్తి-ఈపూరు

రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. మండల కేంద్రమైన ఈపూరులో ఏరువాక పౌర్ణమి సందర్భంగా బుధవారం దుక్కి దున్ని సాగును సమాయత్తం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పంటలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందన్నారు. రసాయనిక ఎరువులు భూమిపై అధికంగా వినియోగించడం ద్వారా భూమి సారవంతం కోల్పోయి విషపూరితమవుతుందని, భవిష్యత్తులో పంటలు పండని అన్నారు. రైతు ఆర్థిక ప్రగతి సాధించినప్పుడే స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యం నెరవేరుతుందని, గొల్లపల్లి రిజర్వాయర్‌తో ఈ ప్రాంతంలో రెండు పంటలకు సాగునీరు అందుతుందని అన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే వ్యవసాయ పరికరాలు, విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచామని, 80 శాతం రాయితీతో డ్రోన్లను అందిస్తున్నామని తెలిపారు. జిడిసిసి బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ తాను ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తానని తెలిపారు. పంటల సాగు విధానంలో రైతులు మార్పు తేవాలన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ స్టాల్‌ను పరిశీలించారు. వ్యవసాయ పరికరాలను, రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు అందజేశారు. అనంతరం ఈపూరు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో రూ.2.55 కోట్లతో హాస్టల్‌కు జీవి ఆంజనేయులు, మక్కెన మల్లికార్జునరావు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఐ.మురళి, ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమల కుమారి, ఎడిఎ బి.రవిబాబు, ఏవో ఆర్.రామారావు, తహశీల్దార్ ఎ.నళిని, ఎంపీడీవో కె.ప్రభాకరరావు, టిడిపి నాయకులు ఆర్.జగ్గారావు, ఎ.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కొండ్రముట్ల గ్రామంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా రైతులతో కలిసి రైతు సంఘం నాయకులు దుక్కులు దున్నారు. శివరామకృష్ణ, సురేష్‌రాజా, ఆర్.ముని వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, జి.వీరాంజనేయులు, ఎన్.వీరయ్య, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండలంలోని బొల్లవరం గ్రామంలో ఏరువాక పౌర్ణమి కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. వర్షాలతో నదులన్నీ నిండి సాగునీటి ప్రాజెక్టులలోకి నీరు సమృద్ధిగా వచ్చి జలకళను సంతరించుకోవాలని, రైతు కష్టం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. నాయకులు డి.నాగేశ్వరరావు, జి.కోటేశ్వరరావు, బి.నాగేశ్వరరావు, ఎస్.వెంకట్రావు, ఆర్.నానయ్య, ఎం.చంద్రశేఖర్, ఎన్.శివ, కె.వీరయ్య, అబ్దుల్ మజీద్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మాచర్ల మండలం అలుగురాజుపల్లిలో స్థానిక రైతులతో కలిసి పొలంలో కాడెద్దులతో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి దుక్కిదున్ని వ్యవసాయ పనులను ప్రారంభించారు. సాగు ఖర్చులను తగ్గించుకునేందుకు, దండగలేని వ్యవసాయం వైపు రైతులు దృష్టి సారించాలని, ప్రకృతి వ్యవసాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో జె.అక్కిరెడ్డి, పి.పుల్లయ్య, ఎన్.వీరస్వామి, సుధాకర్‌రెడ్డి, జి.శ్రీనివాస్ యాదవ్, జె.కొండలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

దేశానికి వ్యవసాయం మూలస్తంభమని, నాగరికత ఎంత ముందుకు సాగుతున్నా వ్యవసాయం లేనిదే మనుగడ లేదని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. నరసరావుపేట మండలం పెట్లూరివారిపాలెంలో ఏరువాక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన అరకతో దుక్కిదున్ని మాట్లాడారు. సాధారణం కంటే ముందుగానే సాగునీరు విడుదలవుతుందని, రైతులు ముమ్మరంగా వ్యవసాయం చేయాలని చెప్పారు. రైతులు, వ్యాపారులు బాగుంటే సమాజం వృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో నరసరావుపేట వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ పి.శ్రీనివాసరావు, నాయకులు జి.జనార్ధన్‌బాబు, కె.బ్రహ్మయ్య, వి.రవి, జి.అంకమ్మ చౌదరి పాల్గొన్నారు.

సిఎస్ఆర్ నిధులతో మూడు సంక్షేమ హాస్టళ్ల వసతి గృహాలు

- గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి
- ఏడాది పాలన సందర్భంగా పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహం శంఖుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి - మంగళగిరి, తాడేపల్లి

నియోజకవర్గంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చొరవతో సీఎస్ఆర్ నిధులతో మూడు సంక్షేమ హాస్టళ్ల వసతి గృహాలు అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించటం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. బుధవారం మంగళగిరిలో వీవీఐటీ చారీటబుల్ ట్రస్ట్ సీఎస్ఆర్ నిధులతో నిర్మించే సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహానికి కలెక్టర్ నాగలక్ష్మి, అంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ మరియు వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డవలప్‌మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ కె.రాజశేఖర్, తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు తమ్మిశెట్టి జానకీదేవి, వీవీఐటీ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్‌తో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్బంగా జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి ఒక సంవత్సరం పూర్తయిన నేపథ్యంలో బుధవారం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో గత సంవత్సర కాలంలో పూర్తి అయిన పనుల ప్రారంభోత్సవాలు, నూతన పనులకు శంకుస్థాపన కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. దీనిలో భాగంగా మంగళగిరి నియోజకవర్గంలో సీఎస్ఆర్ నిధులతో మంగళగిరి, దుగ్గిరాలలో సాంఘీక సంక్షేమ శాఖ, పెనుమాకలో బీసీ సంక్షేమ శాఖ వసతి గఅహాల నిర్మాణాలకు ఎపిఎంఎస్ఐడిసి ఛైర్మన్, జనసేన మంగళగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. మంగళగిరిలో సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గఅహాన్ని వీవీఐటీ చారిటబుల్ ట్రస్ట్ వారు రూ.4.5 కోట్లతో, దుగ్గిరాలలో సాంఘీక సంక్షేమ శాఖ బాలికల హాస్టల్‌ను సెల్ కాన్ ఇంప్లాక్స్ ప్రైవేటు లిమిటెడ్ వారు రూ.3.5 కోట్లతో, పెనుమాకలో బీసీ బాలుర వసతి గఅహాన్ని రాడికో కేతన్ లిమిటెడ్ వారు రూ. 3.5 కోట్లతో అత్యాధునిక విధానంతో నిర్మించటానికి ముందుకు వచ్చారన్నారు. ఒక్కొక్క వసతి గృహంలో ప్రీ మెట్రీక్, పోస్ట్ మెట్రీక్ కు సంబంధించి 150 నుంచి 170 మంది విద్యార్దులకు వసతి కల్పించేలా, అత్యాధునికమైన కిచెన్, డైనింగ్, లివింగ్ రూం, స్టడీ రూం, డార్మీటరీలతో మోడరన్ గా నిర్మించటం జరుగుతుందన్నారు. వసతి గఅహాల నిర్మాణం జరుగుతున్నందున ప్రస్తుతం ఇక్కడి విద్యార్థులను సమీపంలోని ప్రభుత్వ భవనాల్లోకి మార్చటం జరుగు తుందని, నిర్మాణా పనులు తొమ్మిది నెలల్లో పూర్తి అవుతాయని, తదుపరి విద్యాసం వత్సరం నాటికి వీటిని ప్రారంభించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరక్టర్ రాజా దేబోరా ఏపీఈడబ్ల్యుఐడీసీ ఈఈ అనిల్ కుమార్, మంగళగిరి తహశీల్దారు దినేష్ రాఘవేంద్ర, సివిల్ సప్లయిస్ కార్పోరేషన్ డైరక్టర్ తోట పార్ధసారధి, కూటమి నాయకులు పాల్గొన్నారు. తాడేపల్లి కార్యక్రమంలో జనసేన పార్టీ తాడేపల్లి మండల అధ్యక్షులు సామల నాగేశ్వరరావు, జనసేన నాయకులు జొన్నా రాజేష్, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, గుంటూరు జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు కళ్ళం రాజశేఖర్ రెడ్డి, టీడీపీ గ్రామ అధ్యక్షులు రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు పాసులకు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోండి : డీఎం

ప్రజాశక్తి - మంగళగిరి

ఏపీఎస్ ఆర్టీసీ మంగళగిరి డిపో పరిధిలో విద్యార్థిని విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరంలో కొత్త బస్సు పాసులు తీసుకొనుటకు ఏపీఎస్ ఆర్టీసీ బస్సు పాస్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ రిజిస్టర్ చేసుకోవాలని డిపో మేనేజర్ పిచ్చయ్య బుధవారం తెలిపారు. 12 13 తేదీల్లో సాఫ్ట్‌వేర్ ఆఫ్ డేషన్ కొరకు మంగళగిరి బస్టాండ్‌లోని బస్సు పాస్ కౌంటర్ మూసి వేస్తామని తెలిపారు. అందువలన బస్సు పాసులు కావాల్సిన వారు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకొని ఈనెల 14వ తేదీ నుండి బస్సు పాస్ కౌంటర్‌లో తీసుకోవాలన్నారు.

నేడు వెంకటప్పయ్య విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - తెనాలి

గ్రంథాలయ ఉద్యమంలో ఆరు దశాబ్దాలకు పైగా సేవలందించి, గ్రంథాలయ గాంధీగా పేరొందిన వెలగా వెంకటప్పయ్య కాంస్య విగ్రహావిష్కరణ గురువారం తెనాలి బండ్‌పై జరుగనుందని వెలగా హరి సర్వోత్తమరావు తెలిపారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తో పాటు అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొంటారన్నారు.

ఉత్తమ అధికారికి ఘనంగా వీడ్కోలు

ప్రజాశక్తి - తెనాలి

శేషన్నను సత్కరిస్తున్న అధికారులు, మున్సిపల్ సిబ్బంది

వృత్తి పట్ల నిబద్దతతో పనిచేసిన ఏ అధికారైన ఉన్నత స్థాయికి చేరతారని పలువురు వక్తలు కొనియాడారు. మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన బి.శేషన్న నంద్యాల మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి మున్సిపల్ కౌన్సిల్ హాల్ లో ఆయన వీడ్కోలు సభ నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ తాడి బోయిన రాధిక అధ్యక్షతన జరిగిన సభలో వివిధ విభాగాల అధికారులు శేషన్న సేవలను కొనియాడారు. పురపాలక సంఘం అభివృద్ధికి ఆయన విశేష కఅషి చేశారని చెప్పారు. పార్కుల అభివృద్ధి, అంతర్గత రోడ్లు, పారిశుద్ధ్యం మెరుగుపరచడం, ఆయా విభాగాల సిబ్బంది పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షించడంపై వివరించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కొందరు చిరుద్యోగులు భావోద్వేగానికి గురయ్యారు. శేషన్న మాట్లాడుతూ పురపాలక సంఘ అభివృద్ధికి తీసుకున్న నిర్ణయాలలో అధికారులు, కౌన్సిలర్లు, ప్రజలు భాగస్వాములుగా ఉండి సహకరించారని చెప్పారు. ఈ సందర్భంగా కమిషనర్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ కె.వి.గోపాలకృష్ణ, వైస్ ఛైర్పర్సన్ అత్తోట నాగవేణి, సహాయ కమిషనర్ లక్ష్మిపతి, మున్సిపల్ ఇంజనీర్ పి శ్రీకాంత్, మేనేజరు విల్సన్ జయకర్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, ఇంజనీరింగ్, మెప్మా, వార్డు సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

యోగాంధ్ర పేరుతో 'ఐ'రిస్క్ - పొంచి ఉన్న కాలుష్య ప్రమాదం

ప్రజాశక్తి- తాడేపల్లి

ఈనెల 21 ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం విశాఖపట్నంలో తలపెట్టిన యోగాంధ్ర పేరుతో తలపెట్టిన కార్యక్రమం మరో ఉపద్రవానికి కారణమవుతుందా..? అంటే అవును నేను సమాధానం పర్యావరణ పరిరక్షణ వేత్తల నుండి వినవస్తుంది. ఆరోగ్యం కోసం ఇప్పటికీ తమకు నచ్చిన యోగాసనాల ద్వారా ప్రజలు తమ దైనందిన జీవితంలో తమ తమ ఇళ్లల్లో యోగా చేస్తున్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీని ఈ కార్యక్రమానికి పిలిచి పది లక్షల మందితో యోగాంధ్ర కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. ఇందుకు ఉమ్మడి గుంటూరు జిల్లాలో 1500, తిరుపతి మొదలుకొని వివిధ జిల్లాల నుండి మొత్తం తొమ్మిది వేల పాఠశాల బస్సులను, ప్రజలను విశాఖపట్నం తరలించటానికి వినియోగించడానికి రాష్ట్రం మరియు జిల్లాలోని విద్యాశాఖ అధికారులు, రవాణా శాఖ అధికారులు కసరత్తు మొదలు పెట్టారు. తొమ్మిది వేల బస్సులు ద్వారా 45 వేల మందిని ఈ ప్రాంతం నుండి యోగాంధ్ర జరిగే విశాఖపట్నంకి తరలించడానికి అధికారులపై ఒత్తిడి పెరిగిపోయింది. రాయలసీమ, కోస్తాంధ్ర నుండి తరలించే ప్రజలను విశాఖపట్నం దాకా తీసుకెళ్తున్నారా అంటే, అది కూడా లేదని తెలుస్తుంది. విశాఖపట్నంకి సమీపంలోని అనకాపల్లికి ఈ ప్రాంతం నుండి ప్రజలను తీసుకెళ్లే బస్సులు నిలపదల చేస్తారని విశ్వసనీయ సమాచారం. అక్కడనుండి మరో రెండు గంటల ప్రయాణం వేరే బస్సుల ద్వారా యోగాంధ్ర జరిగే ప్రాంతానికి తీసుకెళ్తారని తెలుస్తుంది. ఇంత" ఐ" రిస్క్ తీసుకుని 45 వేల మందిని అక్కడికి తరలించడం అవసరమా అని పాఠశాలల యాజమాన్యాలు పెదవిరుస్తున్నాయి. 45 వేల మంది ని విశాఖపట్నంలో సమీకరించలేరా అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. ఈనెల 18, 19,20,21 నాలుగు రోజులు పాటు వివిధ పాఠశాల బస్సులు తమ ఆధీనంలో ఉండాలని రవాణా శాఖ అధికారులు ఇప్పటికే ఆయా పాఠశాలల యాజమాన్యాలకు హుకుం జారీ చేసినట్టు తెలుస్తోంది. దీనికి జిల్లా విద్యాశాఖ కూడా సంపూర్ణ మద్దతు ప్రకటించి జనాన్ని యోగాంధ్ర పేరుతో విశాఖపట్నం తరలించట దానికి తన వంతు సహకారం అందించడానికి సిద్ధమైంది అనే వార్తలు పర్యావరణ ప్రియులను ఆందోళన కు గురిచేస్తున్నాయి. రాయలసీమ, కోస్తాంధ్ర నుండి 9వేల బస్సులు ఈ ప్రాంతం నుండి విశాఖపట్నం వెళ్లాలంటే పొల్యూషన్ ఎంత ప్రమాదకరంగా మారుతుందో అర్థం చేసుకోవాలని వారు కోరుతున్నారు. వేసవి సెలవులు ముగిసిన అనంతరం 13వ తేదీ (నేటి నుండి) పాఠశాల లుపున ప్రారంభం అవుతున్నాయి. పిల్లలందరూ బడిబాట పట్టే సమయం ఇది.

పాఠశాల పని దినాలు నష్టం

పాఠశాల తెరవగానే నాలుగు రోజులు పాటు మరలా పాఠశాలకు సెలవులు అంటే విద్యార్థులకు పని దినాలు ఈ విద్యా సంవత్సరంలో నష్టపోయినట్లుగానే భావించాల్సి ఉంటుంది. యోగాంధ్ర పేరుతో పాఠశాల బస్సులు తీసుకోవాలని సంకల్పంతో ఎక్కడికి ఎక్కడ జిల్లాలో ఉన్నతాధికారులు పాఠశాలలకు సెలవులు ఇవ్వండి అని ఆదేశాలు ఇవ్వడం కూడా చర్చ నియాంశం అయింది. అయితే జిల్లా ఉన్నతాధికారులు (కలెక్టర్ తదితరులు) మొదలుకొని అందరూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన యోగాంధ్ర ఫీవర్ లో ఉన్నట్లు కనిపిస్తుంది. మరోపక్క దేశంలో "కరోనా" మళ్లీ ఇప్పుడిప్పుడే కోరలు సాస్తుంది. ఇంత మంది జనం పెద్ద ఎత్తున ఒకచోట గుమి గూడి తే ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఇప్పటికే పర్యావరణ పరిరక్షణ ప్రియులు, అభ్యుదయవాదులు తమ ఆందోళన వెలిబుచ్చారు. ఇటీవల రాజధాని పున ప్రారంభ పనులకు ప్రధాని మోడీ వచ్చి శంకుస్థాపన చేసిన సందర్భంగా కూడా స్థానికంతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి ఆర్టీసీ, పాఠశాల బస్సులను కూడా రప్పించిన సంగతిని గుర్తు చేసుకుంటున్నారు. మరలా ఇప్పుడు యోగాంధ్ర పేరుతో రాయలసీమ, కోస్తాంధ్ర నుండి 45 వేల మంది జనాన్ని తరలించడానికి ఇంత" ఐ "రిస్క్ అవసరమా అనేది ముఖ్యంగా పర్యావరణ పరిరక్షణ ప్రియుల నుండి వినవస్తున్న మాట.

దీక్షలల్లో పాల్గొన్న కార్మికులు

190వ రోజుకు ఎసిసి కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి - తాడేపల్లి

తమకు న్యాయంగా రావాల్సిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు బుధవారం నాటికి 190 రోజుకు చేరుకున్నాయి. దీక్షలలో బి. దానయ్య, డి. నాగేశ్వరరావు, నారదాసుసుబ్బారావు, సిహెచ్. పిచ్చయ్య, మల్లె గురవయ్యలు కూర్చున్నారు. దీక్షలను సీఐటీయూ నాయకులు వేముల. దుర్గారావు, కె.స్టీవెన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు గత్యంతరం లేని పరిస్థితుల్లోనే దీక్షలు చేస్తున్నారని చెప్పారు. ఎప్పటికైనా న్యాయం గెలుస్తుందని, బలమైన నమ్మకం తో ముందుకు వెళుతున్నాము అని తెలిపారు. 32సంవత్సరాల ఈ సుదీర్ఘ నిరీక్షణకు కోర్ట్ తీర్పే దివ్య ఔషధం కానుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బి. సూర్యప్రకాశరావు, ఎం. ఆశీర్వాదం, వై. సాంబశివరావు, తుపాకుల నాగేశ్వర్, షైక్ ఇస్మాయిల్, షేక్ బాషా, కె.హగ్గయ్య, సుభాని, ఆరిఫ్, అసిఫ్, కార్మిక కుటుంబాల మహిళలు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించేవిధంగా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించాలని, జర్నలిస్టుల సంక్షేమానికి కఅషి చేయాలని ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్, ఆంధ్ర ప్రదేశ్ బ్రాడ్ కాస్టింగ్ అసోసియేషన్ గుంటూరు జిల్లా శాఖలు ప్రభుత్వాన్ని కోరాయి. ఎపిడబ్ల్యూజెఎఫ్, ఎపిబిజెఎ రాష్ట్ర కార్యవర్గం పిలుపు మేరకు తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో బుధవారం పరిపాలనా అధికారి జి శ్రీధర్ బాబుకు వినతి పత్రం అందజేశారు. తెనాలి ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్. జహీర్, జిల్లా అధ్యక్షులు కనపర్తి రత్నాకర్ మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఏర్పాటు, నూతన అక్రిడిటేషన్ కార్డులను మంజూరుజేయాలని, ఉద్యోగ, ఆరోగ్య భద్రత, కార్మిక బీమా కల్పించాలని తెలియజేసారు. ఫెడరేషన్ నాయకులు అంబటి శ్యామ్ సాగర్, అచ్యుత సాంబశివరావు లు మాట్లాడుతూ జర్నలిస్టులు సంక్షేమానికి మీడియా కమిషన్ ఏర్పాటుతోపాటు మీడియా అకాడమీని బలోపేతం చేయాలని కోరారు. పెన్షన్న సౌకర్యాలను జర్నలిస్టులకు అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఉన్నం ధవన భూషణం, మేకల సుబ్బారావు, వి.వి. నాయుడు, సిహెచ్ శేఖర్ పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

ఎమ్మెల్యే నరేంద్రకు కృతజ్ఞతలు

ప్రజాశక్తి - చేబ్రోలు

ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి మెమోరియల్ ఒంగోలు జాతి జాతీయ స్థాయి వృషభరాజముల బల ప్రదర్శన ఇంతటి పెద్ద కార్యక్రమానికి ప్రోత్సాహాన్ని స్ఫూర్తినిచ్చిన శాసన సభ్యులు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్‌కి, దాతలకు పేరు పేరునా కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. వృషభరాజముల బల ప్రదర్శనలో రాష్ట్ర నలుమూల నుండి పెద్ద ఎత్తున పాల్గొన్న రైతులకు, పశు పోషకలకు కమిటీ వడ్లమూడి తరుపున ధన్యవాదాలు ప్రత్యేక తెలిపారు. ఎడ్ల బలప్రదర్శన గత నెలలో చేబ్రోలు మండలం వడ్లమూడి క్వారీ వద్ద జరిగిన 131 ఎడ్ల జతలతో జరిగింది. ఈ అతి పెద్ద కార్యక్రమానికి రూ. 63,90,270లు ఇచ్చి దాతలకు సహకరించారని తెలిపారు. ఇంత పెద్ద కార్యక్రమానికి మాకు ప్రోత్సాహాన్ని స్ఫూర్తినిచ్చిన శాసన సభ్యులు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్‌కి దాతలకు పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

ఎస్సీ కాలనీలో ఎంఆర్‌పిఎస్ నాయకుల పర్యటన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రొంపిచర్ల మండలం గోగులపాడు గ్రామ ఎస్‌సి కాలనీలో బుధవారం ఎంఆర్‌పియస్ నాయకులు పర్యటించి కాలనీలో నెలకొన్న సమస్యలు అడిగి తెలుసుకొన్నారు. ఎంఆర్ పియస్ మండల కన్వీనర్ పోలెపోగు రాములు మాట్లాడుతూ ఎస్‌సి కాలనీలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు అధికా రులు కృషి చేయాలని అర్హులైన వారికి పెన్షన్లు, సంక్షే మ పథకాలు అమలుచేయాలన్నారు. జులై 7వతేదీన ఎంఆర్ పియస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించి, ప్రతి గ్రామంలో ఎంఆర్ పియస్ జెండాలను ఎగురవేయాలని పిలుపు నిచ్చారు. అనంతరం ఎంఆర్ పియస్ ఆవిర్భావ దినో త్సవ పోస్టర్లను ఆవి ష్కరించారు. కార్యక్రమంలో ఎంఎస్ పి మండల అధ్యక్షుడు మక్కెన పుట్టయ్య, నాయకులు బందెల జేమ్స్, బందెల బాబు, ఏసుపాదం పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న రంగయ్య కుటుంబ సభ్యులు

అవ్వారు రంగయ్య జ్ఞాపకార్థం అన్నదానం

ప్రజాశక్తి - వినుకొండ

విశ్రాంతి ఉద్యోగుల సేవా సంఘం వారి ఆధ్వర్యంలో సంఘ కార్యాలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పా టు చేశారు. ఆవ్వారు రంగయ్య జ్ఞాపకార్థం వారి కుమారుడు అవ్వారు కోటేశ్వరరావు ధర్మపత్ని పద్మావతి కుమార్తె అవ్వారు లక్ష్మీశైలజ ఈ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భువనగిరి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పదేళ్లుగా విశ్రాంత ఉద్యోగుల సేవాసంఘం వారి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అందులో భాగంగా నేడు 87వ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్య క్రమంలో జి నాగేంద్రుడు, బిపిఎస్ సుందర్రావు, ఏ రామ లింగేశ్వరరావు, పి నారాయణరావు, వైవిసుబ్బయ్య శర్మ, రాఘ వయ్య, ఆది రాములు, ఎం.వి.శర్మ, ఎస్ఎస్ఎన్ శాస్త్రి, జి వెంక ట స్వామి, శంకర్రావు, దీక్షితులు, భోగ జయలక్ష్మి పాల్గొన్నారు.

రాములమ్మ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే

కొప్పునూరులో ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి పర్యటన

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మాచర్ల మండల పరిధిలోని కొప్పునూరు గ్రామంలో మాచర్ల శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి బుధ వారం పర్యటించారు. మండల నాయకులు గుండాల శ్రీని వాసరావు మాతృమూర్తి రాములమ్మ పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొని కుటుంబాన్ని పరామర్శించారు. రాములమ్మ చిత్రపటా నికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామం లో మరో టీడీపీ నాయకులు రేఖా అంజి యాదవ్ ఇటీవల పిడుగు పాటుతో మృత్యువాతపడ్డారు. కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో మాచర్ల రూరల్ మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. జూలకంటి అక్కిరెడ్డి, పంగులూరు పుల్ల య్య, కంభంపాటి అనిల్ కుమార్, వజ్రం నాయక్ పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణతో యువతకు ఉపాధి అవకాశాలు

సీడ్ ఏపీ వర్క్‌షాప్‌లో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి

ప్రజాశక్తి - మాచర్ల

ఉద్యోగ, స్వయం ఉపాధి అంశాలపై సీడ్ ఏపీ అంది స్తున్న నైపుణ్య శిక్షణ యువతకు వెన్నుదన్నుగా నిలుస్తోందని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. బుధవారం నెహ్రూనగర్ టీడీపీ కార్యాలయంలో సీడ్ ఏపీ ద్వారా నిర్వహించిన ఒక్కరోజు వర్క్ షాపు కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే జూలకంటి హాజరై ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీన్‌దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన్ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో యువతకు వివిధ రంగాలపై నైపుణ్య శిక్షణ ఇచ్చి ఖచ్చితమైన ఉపాధి మార్గాలను చూపుతోందని పేర్కొన్నారు. నియోజకవర్గం పరిధిలో అనుకూలమైన వ్యాపార, చిన్న పరిశ్రమల స్థాపన వంటి అంశాలపై ఉచితం గా శిక్షణ పొంది, బ్యాంకు రుణాల ద్వారా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం వ్యవసాయం, అనుబంధ రంగాలు, చిన్నతరహా పరిశ్రమల స్థాపన, సంస్థలను నెలకొల్పేందుకు అనుకూల మైన శిక్షణ, సంబంధిత అనుమతిపత్రాలు, బ్యాంకు రుణాలు వంటి అనేక అంశాలను వర్క్ షాపులో పాల్గొన్న వారికి నిపుణులు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మదార్‌సాహెబ్, ఎనుముల మురళీధర్‌రెడ్డి, సీడ్ ఏపీస్టేట్ మిషన్ మేనేజర్ లక్ష్మీదేవి, సెంచ్యూరియన్ యూనివర్సిటీ డాక్టర్ సాయిరాం, ఫుడ్ ప్రాసెసింగ్ డీఆర్పీ శ్యాంప్రసాద్, మండల ఏపీఎం పాల్గొన్నారు.

వినుకొండను ఆధునిక పట్టణంగా తీర్చిదిద్దుతాం : జీవీ

బస్ షెల్టర్లు, వాకింగ్ ట్రాక్ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - వినుకొండ

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వినుకొండను ఆధునిక పట్టణంగా, గ్రేటర్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. వినుకొండ జూనియర్ కళాశాల, ఎన్నెస్పీ మైదానంలో వాకిం గ్ ట్రాక్‌ల నిర్మాణ పనులకు ఆంజనేయులు శంకు స్థాపన చేశారు. శివశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వినుకొండ పట్ట ణంలో అయిదు చోట్ల ఆధునిక బస్ షెల్టర్ల నిర్మాణానికి శ్రీకా రం చుట్టారు. కారంపూడి రోడ్‌లో బస్‌షెల్టర్ నిర్మా ణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ యోగా, వ్యాయామం ఆరోగ్యానికి అవసరమన్నారు. అందు కోసమే వాకింగ్ ట్రాక్ నిర్మాణంతో పాటు ఓపెన్ జిమ్ ఆధునీకరిస్తున్నామని తెలిపారు. ప్రజలు ఎండకు, వానకు ఇబ్బంది పడకుండా శివశక్తి ఫౌండేషన్ ద్వారా పట్టణంలో 5 బస్ షెల్టర్లు నిర్మిస్తున్నామని తెలిపారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణ సహకారంతో తాగునీటి పథకం కోసం రూ. 210 కోట్ల నిధులు తీసుకొచ్చామని, త్వరలోనే టెండ

భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే ఆంజనేయులు

ర్లు పిలిచి పనులు ప్రారంభించిస్తామన్నారు. రామలిం గేశ్వరస్వామి ఘాట్ రోడ్ నిర్మాణానికి కూడా నిధులు తెచ్చా మన్నారు. మురుగునీటిని శుద్ధికి రూ.18 కోట్లతో రెండు మురుగునీటి శుద్ధి కేంద్రాలు తీసుకొచ్చామన్నారు. కార్య క్రమంలో డీసీసీబీ పర్సన్ ఇన్‌ఛార్జి మక్కెన మల్లికార్జున రావు, మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

జీవన ప్రమాణాల మెరుగు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పెదకూరపాడు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చే దిశగా కార్యాచరణను కూటమి ప్రభుత్వం చేపట్టిందని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. బుధవారం ఆయన నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ సంక్షేమంతో పాటు గ్రామాలభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం పింఛన్లు పెంచి ఏడాదిలో రూ.34,000 కోట్లు లబ్ధిదారులకు అందిస్తుందన్నారు. ధాన్యం కొనుగోలు చేసి రైతులకు కూటమి ప్రభుత్వం రూ.13,584 కోట్లను చెల్లించినట్టు చెప్పారు.మత్స్యకారుల కు ఆర్థిక సహాయం రూ.259 కోట్లు పంపిణీ చేసి కూటమి ప్రభుత్వం వారికి ఆర్థికంగా అండగా నిలుస్తుందన్నారు. ఉచిత ఇసుక పాలసీ అమలు చేసి నిర్మాణ రంగానికి ఊతం ఇవ్వడంతో పాటు రోడ్లు, చెత్త తొలగింపు కోసం రూ.1200 కోట్లు ఖర్చు చేసి, 20 వేల కి.మీ మార్గాలు బాగుకు కషి చేస్తున్నామన్నారు.అమరావతికి కేంద్రం ద్వారా 15 వేల కోట్ల ఆర్థిక సహాయం, పోలవరం ప్రాజెక్టుకు 12,500 కోట్ల రూపాయలను, స్టీల్ ప్లాంట్ కు 11400 కోట్లు కేంద్రం ప్యాకేజీ అందించేలా కూటమి ప్రభుత్వం కషి చేసిందన్నారు. ఎం ఎస్ ఎం ఈ పార్కులుకు 175 నియోజకవర్గాల్లో, 42 చోట్ల పనులు ప్రారంభమయ్యాయన్నారు. మహిళల

మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

రక్షణకు శక్తి టీమ్స్, డ్రగ్స్ అదుపుకు ఈగల్ విభాగం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. లక్ష మహిళలకు కుట్టుమిషన్లు, 11 వస్తువులతో ఎన్టీఆర్ బేబీ కిట్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ నెలలోనే తల్లికి వందనం,అన్నదాత పథకం,ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలో అభివద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని రానున్న రోజుల్లో ప్రణాళికా బద్ధంగా అభివద్ధి పనులను చేపట్టేలా కూటమి ప్రభుత్వం కషి చేస్తుందన్నారు. ప్రజల అభిమానం, ఆశీర్వాదమే కూటమి ప్రభుత్వానికి బలమని ముఖ్యమంత్రి చంద్రబాబు,మంత్రి లోకేష్ కషి తో రాష్ట్రం స్వర్ణాంధ్ర సాధన దిశగా అడుగులు వేస్తున్నట్టు తెలిపారు.

కృష్ణమాదిగకు అభినందనలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

ఏంఆర్‌పిఎస్ వ్యవస్థక అధ్యక్షులు కృష్ణమాదిగ పద్మశ్రీ పురస్కారాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఢిల్లీలో అందుకోవటం అభినందనీయమనీ, మాదిగ, ఉప కులాల్లో ఒక నూతన ఉత్తేజాన్ని నింపిందని ప్రగతి మాదిగ దాసు సంక్షేమ సేవ సంఘం అధ్యక్షులు అంకాళ్ళ నాగ రాజు, గౌరవ అధ్యక్షులు ఏ ప్రభుదాసు బుధవారం ఒక ప్రకటనలో ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ అందించిన రిజర్వేషన్ ఫలాలు ప్రతిఒక్కరికి న్యాయ బద్ధంగా అందినప్పుడే సామాజిక అభివృద్ధి సాధ్యం అవుతుందని కృష్ణ మాదిగ భావించారన్నారు. రిజర్వేషన్ ఫలాలు జనాభా దామాషా ప్రకారం అందాలంటే ముందు గా ఎస్సీ వర్గీకరణ ద్వారా సాధ్యం అవుతుందని భావించి ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలంటూ మూడున్నర దశా బ్దాలుగా రాజీలేని పోరాటం చేసిన సామాజిక ఉద్యమ నాయకుడు కృష్ణమాదిగ అన్నారు. ఆయన పోరాట స్ఫూర్తి కి నిదర్శనమే నేడు ఆయనకు దక్కిన అరుదైన గౌరవం అన్నారు. ఇది జాతికి దక్కిన గౌరవంగా వారు అభి ప్రాయా న్ని వ్యక్తం చేశారు. కృష్ణాదిగ భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు అలంకరించాలని వారు ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలువురు సంఘ సభ్యులు ఉన్నారు.

అవగాహనా కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

నాయకత్వ లక్షణాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - క్రోసూరు

క్రోసూరు మండలంలోని స్థానిక లూథరన్ చర్చి ఆవ రణ లో బాలల పార్లమెంట్ పిల్లలకు నాయకత్వ లక్షణాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి అధ్య క్షత క్రోసూరు మండల గుడ్‌షెఫర్డ్ ఇంచార్జ్ టి.లక్ష్మణ్ వహించారు. ముఖ్య అతిథిగా క్రోసూరు మండల ఇంచార్జ తహశీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ పిల్లలు విద్యార్థి దశ నుండే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకుంటే సమా జం లో మంచి నాయకులుగా ఎదిగి సమాజంలో అభి వృద్ధి కి తోడ్పడతారన్నారు. నాయకులు బాధ్యతగా, నమ్మకంగా, నిజాయితీగా, స్వార్థం లేకుండా అందరినీ కలుపుకొని ముం దుకు నడిపించాలన్నారు. పిల్లలు కష్టపడి ఇష్టంగా చదివి సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలి అన్నారు. కార్య క్రమంలో సిస్టర్ యాంటో ఆర్‌ఐ వెంకట్రావు సంస్థ సిబ్బం ది బత్తుల బాబు పవన్‌కుమార్ బ్యుల బాలమర్తి క్రోసూరు గ్రామాలబాలల పార్లమెంటు లీడర్స్ పాల్గొన్నారు.

రహదారి తనిఖీలో కె.ఎల్. రావు, సిబ్బంది

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు కలెక్టర్, రవాణా, పోలీస్ శాఖ వారి జాయింట్ ఎన్‌ఫోర్సుమెంట్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహిస్తున్నామని మండల సహాయ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె.ఎల్‌రావు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ బుధవారం పోలీసు, రవాణా శాఖ, ఆర్‌టిసి.అధికారులు చిలకలూరిపేట నుండి నరసరావు పేట వెళ్ళు రహదారిలో తనిఖీలు నిర్వహించారు. ఇన్సూ రెన్సు, పొల్యూషన్ సర్టిఫికెట్, పన్ను చెల్లించని, హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనములు నడుపుచున్న వారిపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ఇందులో ఇనూ రెన్సు సర్టిఫికెట్ లేనివి మూడు, పొల్యూషన్ సర్టిఫికెట్ లేనివి మూడు, హెల్మెట్ ధరించకుండా వాహనము నడుపుతున్న కేసులు ఏడు, ఫిట్నెస్ సర్టిఫికెట్ లేని, పన్ను చెల్లించని వాహనం ఒకటి ఉన్నాయని చెప్పారు. అపరాధ రుసుముగా రూ. 49,480లు వసూలు చేసినట్లు తెలిపారు. తనిఖీలలో చిలకలూరిపేట ఆర్టీసీ డిఎం రాంబాబు, పోలీస్ శాఖ వారు తరఫునుంచి సీఐ, ఎస్ఐ, ట్రాఫిక్ పోలీసులు రవాణా శాఖ వారి పాల్గొన్నారు.

నేడు, రేపు బస్‌పాస్ కౌంటర్ మూసివేత

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

మాచర్ల బస్టాండ్‌లో ఉన్న బస్ పాస్ కౌంటర్ గురు, శు క్ర వారాల్లో మూసివేస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 సంవత్సరానికి కొత్త రంగులతో పాస్‌లు జారీ చేయ బడతాయని, అందువలన కొత్త పాస్‌లను కంప్యూటర్‌లో ఫీడ్ చేయుటకు, పాత పాస్‌లను తొలగిం చుటకు గానూ 12, 13 తేదీలలో బస్‌పాస్ కౌంటర్ మూసి వేస్తున్నట్లు తెలిపారు. 14వ తేదీనుండి యథావిధిగా బస్‌పాస్లు ఇవ్వ టం జరుగుతుందని కనుక విద్యార్థులు, వారి తల్లితండ్రులు ఈ మార్పును గమనించి, ఆర్టీసీకి సహకరించాలని వీరాస్వామి కోరారు.

నారాకోడూరులో కేంద్ర బృందం పర్యటన

ప్రజాశక్తి - చేబ్రోలు

మండలంలోని నారాకోడూరు గ్రామంలో డిజిటల్ మరియు స్మార్ట్ విలేజ్ అభివృద్ధికి డిజిటల్ సేవల డిమాండ్ అంచనా కోసం బుధవారం గ్రామంలో కేంద్ర బృందం పర్యటించింది. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నారా కోడూరులో ఏర్పాటు చేసిన గ్రామసభలో కేంద్ర ప్రభుత్వం టెలి కమ్యూనికేషన్ డైరెక్టర్లు, పీవీ ప్రవీణ్ డైరెక్టర్ ఆఫ్ టెలి కమ్యూనికేషన్, డివిజన్ లెవెల్ అధికారి రాధిక పాల్గొన్నారు. తహశీల్దార్ కె.శ్రీనివాస్‌శర్మ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి టి.ఊహారాణి సమావేశ వివరాలను తెలిపారు. జాతీయ స్థాయిలో స్మార్ట్ విలేజ్ / సమృద్ధి విలేజ్‌గా చేసేందుకు నారాకోడూరు గ్రామాన్ని ఎంపిక చేశామని, అందులో భాగంగానే గత నెల 22వ తేదీన నారాకోడూరు గ్రామాన్ని సందర్శించి,

ప్రజలు, ప్రతినిధుల నుండి సూచనలు, సమాధాన పత్రాలు తీసుకుంటున్న అధికారులు

గ్రామంలో మౌలిక సదుపాయాలు ఏమి ఉన్నాయి, ఏమి కావాలి పబ్లిక్ నుంచి భారత ప్రభుత్వ టెలికమ్యూనికేషన్ల శాఖ గ్రామస్థాయిలో ఒక సర్వే ప్రశ్న పత్రం ద్వారా గ్రామంలో డిజిటల్ సేవల డిమాండ్ అంచనా కోసం ప్రజల నుండి సమాధానాలు సూచనలు తీసుకున్నా మన్నారు. దీనికి ప్రభుత్వంఏమి చేస్తుందని అనే విషయం గురించి వీడియో ద్వారా ప్రజలకు , డివిజన్ మండల ఉన్నత స్థాయి అధికారులకు గ్రామ సభలో తెలియజేశా రన్నారు. ప్రజల నుండి అవసరమైన వ్యక్తిగత సమాచారం తోపాటు, గ్రామంలో ఆరోగ్య సేవలు పొందడంలో అతిపెద్ద సవాళ్ల గురించి, విద్య మరియు డిజిటల్ అక్షరాస్యత ఆన్‌లైన్ అభ్యాసం, ఆన్‌లైన్ ట్యూషన్ విద్యకు డబ్బులు చెల్లింపు విషయాలు గురించి, పాఠశాలలో డిజిటల్ అభ్యసన మౌలిక సదుపాయాలు గురించిన వివరణలు, నైపుణ్యాభివృద్ధి అంశాల గురించి, వ్యవసాయ సేవలు, ఈ గవర్నెన్స్ సేవలు, నిఘా / భద్రత, ఈ కామర్స్ మరియు లాజిస్టిక్స్, ఆర్థిక చేరిక బ్యాంకింగ్ లేదా బీమా సేవలను ఉపయోగిస్తున్నారా అలాగే డిజిటల్ లావాదివి సమస్యలు ఎదురవుతున్నాయా అనే అంశాల పైన సమాచారం తీసుకున్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి -2 ఆర్ సుబ్బారావు, ఏ ఈ ఆర్ డబ్ల్యుఎస్ పి.శ్రీనివాసరావు, పిఆర్‌ఏఈ ఎస్.కె.ఫిరోజ్‌లాల్, వైద్యాధికారి అబ్రహం లింకన్, అగ్రికల్చర్ ఏవో బి.శ్రీనివాస్ నాయక్, ఏవో ఎ.ఉమాదేవి, మండల కోఆర్డినేటర్ స్వచ్ఛ భారత్ మిషన్, పంచాయతీ కార్యదర్శి అజీజ్, ప్రధానోపాధ్యాయులు ఎం.ఏడుకొండలు, ఏపీఎం శ్రీలక్ష్మి, విద్య,వైద్య,వ్యవసాయ డివిజన్ లెవెల్ అధికారులు, సహకార, సచివాలయ సిబ్బంది, పోలీసుశాఖ గ్రామ ప్రజలు రాజకీయ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్సీ బాలికల హాస్టల్‌కు శంకుస్థాపన

ప్రజాశక్తి - దుగ్గిరాల

రాష్ట్రం లోనే మంగళగిరి నియోజకవర్గంలో అభివృద్ధి శరవేగంగా జరుగుతుందని తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్చార్జ్ పోతినేని శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రం దుగ్గిరాలలో బుధవారం మూడు కోట్ల 50 లక్షల రూపాయలతో నిర్మించిన ఎస్సీ బాలికల హాస్టల్‌కు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా లోకేష్ నేతఅత్వంలో మంగళగిరి నియోజకవర్గంలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. మండల పరిధిలో 14 కోట్ల 17 లక్షల రూపాయలతో 194 పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. అన్ని గ్రామాలలో సిసి రోడ్లు కలవర్తులు నిర్మాణం జరిగిందన్నారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయం మరియు పంచాయతీ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన అభివృద్ధి పనుల పలకాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అంజనా సిన్హా తహశీల్దార్ ఐ.సునీత, టిడిపి నాయకులు గూడూరు వెంకటరావు, ఎంపీపీ షేక్ జబీన్, కేశంనేని శ్రీ అనిత, వెనిగళ్ళ శ్రీకృష్ణ ప్రసాద్, సర్పంచ్ మనవత్ ఖుషి భాయ్, వెంకటేశ్వర నాయక్, రవి యాదవ్, వల్లూరు నరసింహారావు, పసుపులేటి సాయి చైతన్య తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజ నిర్వహిస్తున్న సబ్ కలెక్టర్ తదితరులు

మహిళా సాధికారత భవనాన్ని ప్రారంభించిన మంత్రి మనోహర్

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక కొత్తపేటలో ఆధునీకరించిన మహిళా సాధికారత భవనాన్ని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ బుధవారం పున్ణ ప్రారంభించారు. గతంలో మహిళా మండలి ఆధ్వర్యంలో నడపబడుతున్న భవనాన్ని నిర్వహణ వ్యయాన్ని భరించలేక మహిళా మండలి నిర్వాహకులు ముద్దన కస్తూరిబాయ్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ ఆధ్వర్యంలో మంత్రి మనోహర్ చేతుల మీదుగా ఇటీవల పురపాలక సంఘానికి అప్పగించిన సంగతి తెలిసిందే. మనోహర్ చొరవతో పురపాలక సంఘం నుంచి రూ 20 లక్షల నిధులతో భవనాన్ని ఆధునీకరించారు. మంత్రి మనోహర్‌తో పాటు ముద్దన కస్తూరిబాయ్, డాక్టర్ గోగినేని ఉమ కలిసి భవనాన్ని పున:ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళా మండలి ఆశయాలకు అనుగుణంగా మహిళా సాధికారత కోసం భవనాన్ని ఉపయోగిస్తామన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ సంజన సింహ, మున్సిపల్ చైర్ పర్సన్ తాడి బోయిన రాధిక, వైస్ చైర్ పర్సన్ అత్తోట నాగవేణి, కమిషనర్ బి శేషన్న, తహశీల్దార్ కె.వి గోపాలకృష్ణ, మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి మనోహర్

ప్రాతూరులో ఆంధ్రప్రదేశ్ ప్రజా నాటిక కళాపరిషత్ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని ప్రాతూరులో బుధవారం ఆంధ్రప్రదేశ్ నాటిక కళాపరిషత్ నూతన కార్యాలయాన్ని ఏపీ నాటక కళాపరిషత్ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీకి కార్యస్థలం ఆఫీస్‌ను ప్రాతూరులో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి కలల అంటే కలల పట్ల కళాకారుల పట్ల ఎక్కువ మక్కువ ఉందని అన్నారు. రెండవసారి నాకు నాటిక అకాడమీ చైర్మన్ గా అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు. ప్రాతూరు గ్రామంలో చక్కటి పల్లెటూరి వాతావరణంలో ఆఫీసును ఏర్పాటు చేసిన శ్రీనివాస్ ప్రసాద్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ప్రాతూరు గ్రామ పార్టీ అధ్యక్షులు అరవపల్లి శ్రీనివాస్,కోగండి ప్రసాద్, పి.నాగేశ్వరరావు, కె. సత్య నారాయణ,సిహెచ్ సాంబశివరావు, పి.రంగ నాయకులు,వై హరి బాబు, హసన్, పి.నాగేశ్వరరావు, పి. నరసింహరావు, ఏ సాంబశివరావు, పి. వీరయ్య, కె.కోటేశ్వరరావు, సిహెచ్ మోహన్ రావు,జి. రత్తయ్య,ఎస్. బిజ్జి రాజు, పి. బాబురావు, జోషి, కోటేశ్వరరావు, కె.వేంద్ర, పి.వంశీ, డి. అనిల్, ఎస్.నరేంద్ర, తదితరులు ఎపాల్గొన్నారు.

ప్రాతురులో కళా పరిషత్ కార్యాలయం ప్రారంభించిన గుమ్మడి గోపాల కృష్ణ

మాట్లాడుతున్న విద్యుత్ శాఖ అధికారులు

విద్యుత్ శాఖ అధికారుల విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి - చేబ్రోలు

మండలంలో విద్యుత్ శాఖ అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. బుధవారం విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగ పర్యవేక్షక ఇంజనీర్ బి.విజయకృష్ణ ఆధ్వర్యంలో మండలంలోని గొడవర్రు, గుండవరం, మంచాల, తోట్ల పాలెం, ఉప్పరపాలెం, వడ్లమూడి, వేజెండ్ల, నారాకోడూరు, చేబ్రోలు గ్రామాలలో విస్కృత తనిఖీలు చేసామని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డిపిజి (విజిలెన్స్) సిహెచ్.వెంకటేశ్వర రావు, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.వి.చిరంజీవి ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ తనిఖీలో 18 మంది అధికారులు, 112 మంది సిబ్బంది 56 బృందాలుగా ఏర్పడి 3969 సర్వీసులు తనిఖీ చేశామని తెలిపారు. మీటరు లేకుండా డైరెక్ట్‌గా విద్యుత్ సౌర్యానికి పాల్పడుతున్న ఒకరికి రూ.2000, మీటరు ఉన్నప్పటికీ అక్రమ సౌర్యానికి పాల్పడుతున్న ఇద్దరికి రూ.60000, అనుమతించని కేటగిరీలో కాకుండా ఇతర కేటగిరిలో విద్యుత్ సౌర్యానికి పాల్పడుతున్న ఐదుగురికి రూ.58000 అనుమతించిన లోడు కంటే అదనంగా విద్యుత్ వాడుతున్న 33 మందికి రూ.267000, అసలైన వాడకము కంటే బిల్లు తక్కువగా ఇవ్వబడిన మూడు సర్వీసులను గుర్తించి రూ.35000, మొత్తం 43 మందికి రూ.422000, అపరాధ రుసుము విధించడం జరిగిందని తెలిపారు. విద్యుత్ సౌర్యము సామాజిక నేరము , ఎవరైనా విద్యుత్ సౌర్యానికి పాల్పడినచో , వారిపై ఫిర్యాదులు తెలుపుటకు పూర్తి వివరములతో సెల్ నెం - 944081 2263 , 944081 2360 ,944081 2361, నేరుగా గాని వాట్సఅప్ ద్వారా గాని సంప్రదించవచ్చని తెలిపారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని, ఈ తనిఖీలు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (విజిలెన్స్) ఎన్.మల్లికార్జున ప్రసాద్, ఆపరేషన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రూరల్ 2 చుండూరు, డి.రాజశేఖర్ బాబు, ఆపరేషన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రూరల్ 1 తెనాలి కె.రాజశేఖర్, విజిలెన్స్ ఏఈలు కె.కోటేశ్వరరావు, ఎం.సతీష్ కుమార్, ఎం.శివ శంకర్, ఆపరేషన్ ఏఈ బుర్ర శ్రీనివాసరావు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు స్ఫూర్తి ఫౌండేషన్ చేయూత

ప్రజాశక్తి -మేడికొండూరు

మండలంలోని పేరేచర్లకు చెందిన వల్లెపు నికిత లక్ష్మి పదవ తరగతి పరీక్షలలో 530 మార్కులు సాధించింది. ఈ అమ్మాయి తండ్రి ఆడపిల్ల పుట్టిందని ఈ అమ్మాయిని 10 రోజుల వయసులోనే వదిలేసి వెళ్లిపోయాడు. అప్పటినుండి ఈ అమ్మాయి తల్లి సౌరమ్మ కూలి, నాలి కష్టార్జితం మీదే పనులకు వెళుతూ ఈ అమ్మాయిని చదివించుకుంటుంది. పై చదువులు చదివించుకునే స్తోమత లేక దాతలు ఎవరైనా ముందుకు వచ్చి మా అమ్మాయి చదువుకు సహకరించాలని విద్యాశాఖ ద్వారా వేడుకోవడం జరిగింది. ఈ విషయం తెలుసుకొని సిరిపురం గ్రామమునకు చెందిన స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధి కడియాల శివప్రసాద్ విద్యార్థి ఉన్నత చదువులకు ఆర్థిక సహాయం చేసేందుకు ముందుకు వచ్చారు. వాళ్ల స్థితిగతులను పరిశీలించి స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ శ్రీవ్యాల్‌కి, దాతలకు తెలియజేయగా వెంటనే స్పందించి ఈ అమ్మాయిపై చదువులకు కావలసిన రూ 1.20 లక్షలు ఆర్థిక సహాయాన్ని కడియాల శివప్రసాద్ ద్వారా అందించారు. కుటుంబ దీన పరిస్థితిని అర్థం చేసుకొని సహాయం అందించిన స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ శ్రీవ్యాల్‌కి, దాతలకు విద్యార్థిని తల్లి, బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రాంగణ ఎంపిలకు హాజరైన విద్యార్థులతో చలపతి ప్రిన్సిపాల్ తదితరులు

చలపతి ఫార్మసీలో మ్యాన్‌కైండ్ ఫార్మా ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి-గుంటూరు

లాంలోని చలపతి ఫార్మసీ కాలేజిలో బుధవారం ఢిల్లీకి చెందిన మ్యాన్‌కైండ్ ఫార్మా ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ వారు బి.ఫార్మసీ, బిఎస్‌సి ఇతర సైన్స్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు మెడికల్ రిప్రజెంటేటివ్స్ విభాగంలో ఉద్యోగాలకు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. 17 మంది విద్యార్థులు పాల్గొనగా ముగ్గురు విద్యార్థులు మెడికల్ రిప్రజెంటేటివ్‌లుగా అర్హత సాధించారని కంపెనీ ఏరియా మేనేజర్ పవన్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు గుంటూరులోనే ఉద్యోగ నిర్వహణ చేస్తారని వారికి సంవత్సరానికి 3.5 లక్షల వేతనం ఇవ్వనున్నట్లు తెలియజేశారు ఎంపికైన విద్యార్థులను చలపతి విద్య సంస్థల అధినేత శ్రీ వైవి ఆంజనేయులు గారు కళాశాల ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు గారు శుభాభినందనలు తెలియజేశారు

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మూర్తి, సాహితీవేత్తలు

సాహిత్య రంగంలో దయానంద్ కృషి అభినందనీయం

ప్రజాశక్తి-గుంటూరు

ప్రముఖ రచయిత కాట్రగడ్డ దయానంద్ వ్యాసాల సంపుటి సాహిత్య సందర్భాలు ఆవిష్కరణ స్థానిక గొట్టిపాటి కళ్యాణ మండపంలో బుధవారం నిర్వహించారు. పుస్తకాన్ని ఆవిష్కరించిన విజయవాడ పోస్ట్‌మాస్టర్ జనరల్ డి.ఎస్.వి.ఆర్ మూర్తి మాట్లాడుతూ ఒకవైపు ఉద్యోగ బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తూ సాహిత్య రంగంలో దయానంద్ కృషి చేయడం అభినందించదగ్గ విషయమని కొనియాడారు. వృత్తి, ప్రవృత్తులను సమతూకంగా నిర్వహించడం చాలా కష్టసాధ్యమని, దానిని అవలీలగా సాధించిన వాళ్ళు ఎంతోమంది తపాలా శాఖలో ఉన్నారని చెప్పారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ప్రముఖ విమర్శకులు పెనుకొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అభ్యుదయ వామపక్ష సాహిత్య దృక్పథంతో దయానంద్ రచనలు చేసినట్లు వివరించారు. సభకు అధ్యక్షత వహించిన పాపినేని శివశంకర్ దయానంద్ వ్యాసాల్లోని విలక్షణతను సోదాహరణంగా వివరించారు. సభలో కందిమల్ల శివప్రసాద్, బండ్ల మాధవరావు, పారా అశోక్, భూసురపల్లి వెంకటేశ్వర్లు, శ్రీరామ కవచం సాగర్, నల్లూరి రుక్మిణి, క్రోసూరు రవికుమార్, ఎస్.ఎమ్ సుభాని, క్రాంతి పాల్గొన్నారు. అనంతరం జరిగిన దయానంద్ ఉద్యోగ విరమణ అభినందన సభలో ప్రముఖ పోస్టల్ ట్రేడ్ యూనియన్ నాయకులు వి. శ్రీధర్‌బాబు ,వాసిరెడ్డి శివాజీ, సిహెచ్ .విద్యాసాగర్ ప్రసంగించారు.

త్వరలో స్ట్రీట్ వెండింగ్ జోన్లు ఏర్పాటు : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరం లోని వీధి వ్యాపారుల సంక్షేమానికి నగరపాలకసంస్థ కట్టుబడి ఉందని, వెండింగ్ కమిటీ ద్వారా త్వరలో నగరంలో స్ట్రీట్ వెండింగ్ జోన్ల గుర్తింపు జరుగుతుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం నగర కమిషనర్ ఛైర్మన్‌గా స్ట్రీట్ వెండింగ్ కమిటీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వెండింగ్ కమిటీ గురువారం నుండి నగరంలో వీధి వ్యాపారుల కోసం గ్రీన్, ఎల్లో, రెడ్ జోన్ల ఏర్పాటుకు పరిశీలిస్తారన్నారు. ఇప్పటికే సచివాలయ కార్యదర్శుల ద్వారా వీధి వ్యాపారుల సమగ్ర సర్వే జరుగుతుందని, వారం రోజుల్లో జోన్ల ఏర్పాట్లపై కమిటీ సూచనల మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తామన్నారు. వెండింగ్ కమిటీలో వీధి వ్యాపారులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఉన్నారని, అందరికీ ఆమోదయోగ్యంగా ప్రాంతాలను జోన్లుగా ఏర్పాటు చేస్తామన్నారు. వెండింగ్ జోన్లకు అవసరమైన ప్రాంతాలలో అంగీకారం తెలిపిన ప్రైవేట్ స్థలాలను కూడా అద్దె ప్రాతిపదికన తీసుకుంటామన్నారు. వార్డు సచివాలయాల వారీగా స్ట్రీట్ వెండర్ల సర్వే జరుగుతుందని, ఇంకా ఎవరైనా సర్వేలో కవర్ కాకుంటే సచివాలయంలో సంప్రదించాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సిఎంఓహెచ్ డాక్టర్ అమతం, వెండింగ్ కమిటి సభ్యులు, కార్పొరేటర్లు బొడ్డుపల్లి స్మిత పద్మజ, ఈరంటి వరప్రసాద్, షేక్ మీరావలి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక విలువలు పెంచేందుకు కృషి చేయాలి

వర్సిటీలో సచ్చిదానంద మూర్తి విగ్రహావిష్కరణలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ మధుమూర్తి

ప్రజాశక్తి - ఎఎన్‌యు

విశ్వవిద్యాలయాలు సామాజిక విలువలను పెంపొందించే తత్వ కేంద్రాలుగా విలసిల్లాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కొత్త మధుమూర్తి అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని బుద్దిస్ట్ స్టడీస్ విభాగం వద్ద ఏర్పాటుచేసిన తత్వవేత్త, యుజిసి మాజీ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ కొత్త సచ్చిదా నందమూర్తి కాంస్య విగ్రహాన్ని బుధ వారం ఆయన ఆవిష్కరించారు. ఆనంతరం మధు మూర్తి మట్లాడుతు జిల్లాకు చెందిన పద్మ విభూ షణ్ కొత్త సచ్చిదానందమూర్తి తత్వశాస్త్రంలో చేసిన కృషి, ప్రపంచ దేశంలోని పరిశోధకులను కూడా ఆకర్షించిందని, ప్రధానంగా ఆయన విద్యా రంగంలో విలువలను అభివద్ధి చేయ డానికి కృషి చేశారని తెలిపారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సర్వతోముఖాభివద్ధికి సచ్చిదానందమూర్తి ఎనలేని సేవలందించారని కొనియాడారు. తెలుగు జాతికి మణిపూసగా ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి నిలవడంతో పాటు ప్రఖ్యాత తత్వశాస్త్రాచార్యుడు, ఆంధ్ర విశ్వకళా పరిషత్ లో తత్వశాస్త్రాచార్యునిగా, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయములో ఉపకుల పతిగా విధులు నిర్వహించారని గుర్తు చేశారు. బౌద్ధమతముపై, బుద్ధుని బోధనల తత్వముపై విశేష పరిశోధనలు చేశాడు. ఆచార్య నాగార్జునిపై ఎంతో కొనియాడబడిన గ్రంథము రాశారని చెప్పారు. భారతీయ మరియు పాశ్చాత్య తత్వశాస్త్రాల గురించి లోతుగా అధ్యయనం చేసి దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే ప్రముఖ తత్వవేత్తగా ప్రసిద్ధి చెందటం ఈ ప్రాంతానికి ఎంతో గర్వకారణం అని కొనియాడారు. విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య. కే గంగాధర్ రావు మాట్లా డుతూ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ అభివృద్ధికి ఆయన కృషివలన మహాయన బౌద్ధ అధ్యయన కేంద్రం, శాస్త్రీయ సౌమ్యవాద కేంద్రాన్ని ఏర్పాటు చేశారని అన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ కె రత్నషీలామణి, రిజిస్టర్ ఆచార్య. జి సింహాచలం , ఆచార్య సచ్చిదానందమూర్తి తనయుడు ఆచార్య కొత్త రమేష్, ఆచార్య డి. రామకోటయ్య (పూర్వ ఉపకులపతి), ఆచార్య ఆర్. సాంబశివరావు (పూర్వ రిజిస్టర్), డాక్టర్ గద్దె మంగయ్య, ఆచార్య ఎం. రామకుమార్ రత్నం, ఆచార్య స్వరూప రాణి, తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు బస్‌పాస్ కౌంటర్ సేవలు నిలుపుదల

ప్రజాశక్తి-గుంటూరు

బస్‌పాస్‌లకు సంబంధించిన సాఫ్ట్‌వేర్ అప్డేషన్ చేస్తున్నందున నేడు, రేపు బస్‌పాస్ కౌంటర్ పనిచేయదని గుంటూరు ఆర్టీసి డిపో 2 మేనేజర్ ఆర్.పిచ్చయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 14వ తేదీ నుండి యధావిధిగా పనిచేస్తాయన్నారు. విద్యార్థులు అందరు ఆన్‌లైన్‌లోనే బస్‌పాస్ ఎంట్రీ చేయించుకున్న యెడల ఆలస్యం కాకుండా విద్యార్థులు పాస్‌లు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. కావున విద్యార్థులు సహకరించాలని కోరారు.

ప్రతివారం రుణ దరఖాస్తులపై సమీక్ష

ఎంపి లావు శ్రీకృష్ణ దేవరాయులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

స్టాండప్ ఇండియా, ముద్ర యోజన వంటి పథకాల రుణాల కోసం అందే దరఖాస్తులపై కలెక్టరేట్‌లో ప్రతివారం సమీక్ష నిర్వహిస్తామని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. రుణ దరఖాస్తుదారులు, బ్యాంకర్లను ఒకే వేదిక మీదకు తెచ్చి దరఖాస్తులపై రుణం దక్కుతుందా, లేదా అనేది అక్కడే తెలియజేస్తామన్నారు. బుధవారం కలెక్టరేట్ లో దిశ (జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు పర్యవేక్షణ) కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రభుత్వ చీఫ్ విప్ వినుకొండ ఎమ్మెల్యే జి.వి ఆంజనేయులు, జిల్లా కలెక్టర్ పి అరుణ్‌బాబు, నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, జీడిసిసి చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఎంపి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలు, నిధులు పూర్తి స్థాయిలో ప్రజలకు దక్కేలా అధికారులు కృషి చేయాలన్నారు. చీఫ్ విప్ జీవి ఆంజనేయులు మాట్లాడుతూ రైతుల ఆదాయం పెంచేందుకు వ్యవసాయ అధికారులు కృషి చేయాలన్నారు. ఎక్కువ ఆదాయం వచ్చే పంటల గురించి రైతులకు తెలియజేయాలన్నారు. సమావేశంలో పల్నాడు జిల్లా కలెక్టర్ పి అరుణ్ బాబు మాట్లాడుతు జిల్లాలో గత ఏడాది దిగుబడి, ఆదాయం ఎక్కువగా ఉండటం వల్ల ఈ ఏడాది బ్లాక్ బర్లీ సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగిందన్నారు. ప్రస్తుతం బ్లాక్ బర్లీ ధర తక్కువగా ఉండటంతో రైతులు నష్టపోతున్నారన్నారు. బ్లాక్ బర్లీ పంట కొనుగోలులో ఉన్న సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం పంట కొనుగోళ్లు చేపట్టి రైతులను ఆదుకుంటోందన్నారు. గ్రామ సచివాలయాల వ్యవసాయ సంబంధిత సమాచారాన్ని మరింత మెరుగ్గా రైతులకు అందించాలని అధికారులను ఆదేశించారు.

‘సాహిత్య బాటసారి శారద స్మృతి శకలాలు’ పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి తెనాలి

పుస్తకావిష్కరణలో పాపినేని శివశంకర్, పెనుగొండ లక్ష్మీనారాయణ

సమాజంలో వివిధ రంగాలలో విశేష కృషి చేసిన ప్రముఖులను నేటితరం యువత ఆదర్శంగా తీసుకోవాలని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పాపినేని శివశంకర్ అన్నారు. స్థానిక ప్రకాశం రోడ్డు లోని ఏఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో బుధవారం ‘సాహిత్య బాటసారి శారద స్మృతి శకలాలు’ పుస్తకావిష్కరణ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వివేక విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ రావిపాటి వీరనారాయణ రావు అధ్యక్షతన జరిగిన సభలో శివశంకర్ మాట్లాడుతూ ప్రముఖ రచయిత నటరాజన్ శారద సాహిత్యం సమాజానికి అవసరమన్నారు. శారద కలం పేరుతో చేసిన రచనలలో స్త్రీలు తమ దైనందిన జీవితాలలో పడుతున్న శ్రమలను అద్భుతంగా మలిచారన్నారు. నేటి యువత సెల్ ఫోన్లలో వివిధ రకాల రీల్స్ చూడటం ద్వారా వారిలో సహజ సిద్ధమైన ప్రేమ, దయ, కరణ అదశ్యమవుతున్నాతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మ సౌందర్యం కలిగిన మదర్ థెరిస్సా వంటి మహనీయులను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అరసం జాతీయ అధ్యక్షులు, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తమిళనాడు పుదుక్కోటలో జన్మించిన శారద తెనాలి వచ్చి హోటల్ కార్మికునిగా జీవిస్తూ తెలుగు నేర్చుకొని, సాహితీ దిగ్గజంగా ఎదిగారని కొనియాడారు. 1985లో ఆలూరి భుజంగరావు రచించిన పుస్తకాన్ని, నేడు తెనాలి ఇంప్రెషన్స్ వారు పున్ణ ముద్రణ చేశారని చెప్పారు. జన సాహితి మాసపత్రిక సంపాదకులు కొత్తపల్లి రవిబాబు మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలను యువత తెలుసుకోవాలంటే ముందుగా సమకాలీన రచయితలు, కళాకారుల గురించి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో అరసం జిల్లా అధ్యక్షులు చెరుకుపల్లి సింగారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, ఎఎస్ఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొలసాని రాంచంద్, ఆచార్య గుజ్జర్లమూడి కపాచారి, ఉమా రాజశేఖర్, నటరాజన్ శారద కుమార్తె శారద, కుమారులు సుబ్రహ్మణ్యం, రాధాకష్ణమూర్తి, ఆలూరి భుజంగరావు కుమార్తె ఉషారాణి, ముత్తేవి రవీంద్రనాథ్, మొవ్వ సత్యనారాయణ, ప్రొఫెసర్ లలితానంద ప్రసాద్, కాటూరి వెంకటేశ్వరరావు, బి ఎల్ నారాయణ పాల్గొన్నారు.